పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల నొప్పులకు పసమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :08 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శనివారం 16 మే 2026 పేజీలు :12 వేల రూ5 /-

## హైదరాబాద్‌కు హైస్పీడ్ రైలు కనెక్టివిటీపై
# తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

**హైదరాబాద్, మే 15** : హైస్పీడ్ రైలు కారిడార్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంబై, చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర రైల్వేశాఖతో కలిసి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047కు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులు కీలకమని చెప్పుకొచ్చారు. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనకరమని తెలిపారు. హైదరాబాద్ -- పుణె -- ముంబై కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 671 కిలోమీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణలో 93 కిలోమీటర్లమేర భూసేకరణ అవసరమని తెలిపారు. హైదరాబాద్ -- బెంగళూరు, చెన్నై కారిడార్లకు 123 కిలోమీటర్ల భూసేకరణ కావాలని చెప్పారు.



ఎవీణూా, +వీ=, రైల్వేశాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతులపై చర్యలకు సీఎస్ రామకృష్ణరావు ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో
# పీసీసీ చీఫ్ భేటీ..

**ఓటర్ల జాబితా సవరణపై చర్చ**

**హైదరాబాద్, మే 15**: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా లేని ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రతిపక్షాలకు పడే ఓట్లను టార్గెట్ చేస్తూ తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'ఓటర్లందరూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరి



ఓట్లను వారే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తమ ఓటు హక్కు జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి' అని అన్నారు. ఈ భేటీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఓటర్ల జాబితాలో పారదర్శకత పాటించాలని ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు.

# తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

**: శ్రీధర్‌బాబు**

**సంగారెడ్డి, మే 15** : తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో TGIIC చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది




స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్ –IIకి శ్రీకారం చుట్టారు.

**1500 మంది మహిళలకు ఉపాధి..**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి ు+××జ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ - మిగతా3లో

## 'చేప ప్రసాదం' కోసం
# సిద్ధమవుతున్న హైదరాబాద్

**ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరిగే మృగశిర కార్తె చేప ప్రసాదం కార్యక్రమం**

**ఆస్తమా, శ్వాసకోశ సమస్యలలో బాధ పడేవారికి ఔషధంగా చేప ప్రసాదం**

**ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్‌లో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే 'మృగశిర కార్తె చేప ప్రసాదం' పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, బత్తిన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ



కార్యక్రమానికి తరలివచ్చే అవకాశం - మిగతా3లో




# పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**న్యూఢిల్లీ, మే 15:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3కు పైగా పెంచాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వస్తాయని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. 2024, మార్చి నుంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పు లేదు. ఆ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు వీటి ధరలను లీటర్‌కు రూ.2 మేర ఆయిల్ కంపెనీలు తగ్గించిన విషయం విదితమే. మరో వైపు నయారా, షెల్ వంటి ప్రైవేట్ రిఫైనరీలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

(పెంచిన ధరలతో..)

ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 97.77, డీజిల్ ధర రూ. 90.67 గా ఉంది.

కోల్‌కతాలో పెట్రోల్ రూ.108.74, డీజిల్ రూ.95.13గా ఉంది.

ముంబయిలో పెట్రోల్ లీటర్ ధర రూ.106.68, డీజిల్ రూ.93.14 గా ఉంది. చెన్నైలో పెట్రోల్ లీటర్ ధర రూ.103.67, డీజిల్ ధర రూ.95.25గా ఉంది.

## అప్పుల పాలవుతున్న
# జీహెచ్‌ఎంసీ

**హైదరాబాద్, మే 15:** ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జీహెచ్‌ఎంసీకి భరోసా కల్పించాల్సిన సర్కారు సంస్థ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది. జీహెచ్‌ఎంసీని సైబరాబాద్ (సీఎంసీ), మల్కాజిగిరి (ఎంఎంసీ)గా విభజించిన సర్కారు..ఆస్తుల విభజన, అప్పులను సీజీజీ నేతృత్వంలో కమిటీ వేయగా.. దాదాపు రూ. 4,717 కోట్ల అప్పులను సర్కారు ఆదుకోవాలంటూ ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే అప్పులను టెకోవర్ చేసుకునేందుకు ససేమిరా అంటున్నది. ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా సర్దుబాటు చేసుకోవాలంటూ ఉచిత సలహా ఇవ్వడం విశేషం..కాగా బల్దియా చేసిన వేల కోట్ల అప్పులను నేరుగా టేకోవర్ చేసేందుకు సాంకేతిక ఇబ్బందులు ఉన్న దృష్ట్యా,




పన్ను బకాయిల రూపంలో నిధులను సర్దుబాటు చేసి సంస్థను బలోపేతం - మిగతా3లో

## బండి వ్యవహారంపై
# అధిష్టానం ఆరా...

**హైదరాబాద్, మే 15:** తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కు పెద్ద తిప్పలే ఎదురవుతున్నాయా? పుత్రుడి కారణంగా ఆయన సంపాయించుకున్న పేరు, పరపతి ఇబ్బందుల్లో పడిపోయిందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. బండి కుమారుడు భగీరథ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాంటూ.. బాలిక వాంగ్మూలం ఇవ్వడం... దీనిపై కేసు నమోదు కావడం తెలిసిందే. అయితే.. వాస్తవానికి నాలుగు రోజులుగా ఈ వ్యవహారం నలుగుతున్నా.. అనూహ్యంగా ఇప్పుడు ఢిల్లీ వరకు పాకింది. "కేంద్ర సహాయ మంత్రి బండి కుమారుడిపై పోక్సో కేసు నమోదైంది" అంటూ..మంగళవారం సాయంత్రం హోరెత్తి పోయింది. అంతేకాదు.. దీనికి కర్ణాటకలోని - మిగతా3లో



## ఇందిరమ్మ జర్నలిస్టుల హోసింగ్ సొసైటీకి
# సబ్ కమిటీలో చోటు కల్పించాలి

**పలువురు మంత్రులు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్,**

**ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమీషనర్‌కు వినతిపత్రాల సమర్పణ**

**హైదరాబాద్, మే 15 ప్రైన్యూస్** ) దశాబ్దాలుగా సొంతింటి కల నెరవేరక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని ఇందిరాగాంధీ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ప్రతినిధులు కోరారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కమిటీలో తమ సొసైటీకి కూడా స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ





# సంపాదకీయం

## దక్షిణాపథంలో బీజేపీ జైత్రయాత్ర ఎప్పుడు?

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో కొన్ని దశాబ్దాల పాటు ఎర్ర కెరటాలు ప్రతి ఏటా ఉప్పొంగేవి. కానీ ఈ మే 9న కాషాయ అలలు పరవళ్లు తొక్కాయి. ప్రధానమంత్రి మోదీ, వేలాది ప్రజల సమక్షంలో సువేందు అధికారి బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా ఒక రోజు తర్వాత ఆదివారంనాడు దక్షిణాదిన చెన్నైలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సినీనటుడు చంద్రశేఖరన్ జోసెఫ్ విజయ్ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో తమిళనాడు 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పట్టాభిషేకానికీ అంతే భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకుని, పశ్చిమాన గుజరాత్, మహారాష్ట్రల్లో, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలో, తూర్పు, కోస్తా ప్రాంతంలో తొలుత ఒడిషా, ఇప్పుడు బెంగాల్‌లో విస్తరించిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో అడుగుపెట్టడం అంత సులభం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. అటు సువేందు అధికారి, ఇటు జోసెఫ్ విజయ్ ఈ పరిణామాలకు ప్రతిఫలనాల్లా కనిపిస్తున్నారు. ఈ రెండు ఘట్టాలు భారత దేశ ప్రజల ఆలోచనా దృక్పథంలో రెండు భిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయా? బెంగాల్‌లో సువేందు అధికారి పక్కన నిలబడిన నరేంద్రమోదీ ఇప్పుడు దక్షిణాదిలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటే, కేరళలో విజయం సాధించి, జోసెఫ్ విజయ్ పక్కన నిలబడ్డ రాహుల్‌గాంధీ ఉత్తరాదిలో పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను ప్రతిఘటించిన దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఏమంత ఆహ్వానించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రవేశించేందుకు చేయని ప్రయత్నం లేదు. అమలు చేయని ప్రయోగం అంటూ లేదు. ఏపీలో తెలుగుదేశం ఆధిపత్యాన్ని అంగీకరించిన బీజేపీ కర్ణాటకలో ఉన్న అధికారాన్ని కోల్పోయి, మళ్లీ పట్టుకోసం నానా యత్నాలు చేస్తోంది. తమిళనాడులో స్వంతంగా బలపడడం కష్టమని గ్రహించిన తర్వాత మళ్లీ అన్నాడీఎంకేతో చేతులు కలపక తప్పలేదు. కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి 3 సీట్లు సాధించిన బీజేపీ ఓట్ల శాతం మాత్రం గతంతో పోలిస్తే ఏమంత పెరగలేదు. కేరళ, తమిళనాడులో బీజేపీ ప్రవేశించడం సుదూర స్వప్నమైతే అవకాశం ఉన్న రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే కర్ణాటక, తెలంగాణల్లో మోదీ పర్యటన భిన్న రీతుల్లో సాగింది. కర్ణాటకలో జాతీయవాద రాజకీయాలవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని, త్వరలో కాషాయ ప్రభంజనం ఆ రాష్ట్రంలో వీస్తుందని చెప్పిన మోదీ తెలంగాణలో మాత్రం ఆ విశ్వాసాన్ని ప్రకటించలేదు. 1984లో దేశ వ్యాప్తంగా కేవలం బీజేపీ గెలుచుకున్న రెండు స్థానాల్లో ఒకటి గుజరాత్‌లోని మెహసానా కాగా, రెండవది తెలంగాణలో హన్మకొండ. ఇప్పుడు గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగా, తెలంగాణలో మాత్రం అనుకున్నంతమేరకు విస్తరించలేక పోతోంది. ఈ విషయాన్ని స్వయంగా మోదీయే రాష్ట్ర నేతల దగ్గర ప్రస్తావించి వారిని విమర్శించారు. బండి సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బీజేపీ కేడర్‌లో కొంత ఊపు వచ్చింది కాని ఆ తర్వాత ఆ ఉత్సాహం క్రమంగా నీరుకారిపోయింది. సంఘ్ పరివార్ సంస్థలైతే హిందూత్వ దిశగా ప్రజల్ని మళ్లించగలవు కాని రాజకీయంగా ప్రజల్లో కదలిక తేవాల్సింది బీజేపీ నేతలే. మోదీ తాజా పర్యటనలో బీజేపీ నేతలకు బహిరంగంగా ఎలాంటి దిశానిర్దేశం చేయలేదు. ఉత్తరాది, బెంగాల్‌లో అవలంబించిన పద్ధతులు దక్షిణాదిన పనిచేయవని ఆయనకు తెలుసు. అయితే తెలంగాణకు సంబంధించి మోదీ వద్ద ఏదో వ్యూహమే ఉన్నట్లు ఆయన మాటలు, సమావేశాలు అనుమానాలు కలిగిస్తున్నాయి. అదేమిటో కాలమే చెబుతుంది. బెంగాల్‌లో బీజేపీ విజయంతో మమతా బెనర్జీ తర్వాత కమలనాథులను ఢీకొనగల శక్తులంతా ఒక్కొక్కరూ మాయవుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అయినా కనీసం బీజేపీని ఢీకొనగలదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించిన నాయకులు అందరూ ఒక్కొక్కరూ కుప్పకూలిపోయారు. నితీశ్‌కుమార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, కేసీఆర్, శరద్‌పవార్, కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే అందరూ మోదీని వ్యతిరేకించి ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకున్నవారే. 2023లో ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు తీవ్ర యత్నాలు చేసిన నితీశ్ తర్వాత అధికారం కోసం బీజేపీ వైపు మళ్లి, ఇప్పుడు బీజేపీకే అధికారాన్ని వదులుకున్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయగలిగిన నేతల నందరినీ మోదీ చతుర్విధోపాయాలు ఉపయోగించి పక్కకు తప్పించారు. వీరెవరూ జాతీయ స్థాయిలో ఇప్పుడు మోదీని ఎదుర్కోగలిగేందుకు చేయగలిగింది ఏమీ లేకపోగా, రాష్ట్ర స్థాయిలో మనుగడకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీని చీల్చి ప్రాబల్యం సంపాదించిన బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీలో కూడా తిరుగుబాటును ప్రేరేపించింది. తమిళనాడులో కొత్త శక్తి ఆవిర్భవించినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ శక్తి తన బలం ఎంతమేరకు పుంజుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. వామపక్షాలకు ఉన్న ఏకైక ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ వశమైంది. పార్లమెంటులో వామపక్షాల ఉనికి క్రమంగా క్షీణించిపోతోంది. ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు బలహీనపడంతో బీజేపీని కాంగ్రెస్ మాత్రమే ఒంటరిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బహుశా బీజేపీ కూడా అదే కోరుకుంటుందేమో. బీజేపీ వ్యతిరేక రాజకీయాలు బలహీనపడడమో, ఆవశ్యకత కోల్పోవడమో స్పష్టంగా కనపడుతోంది. అది నాయకత్వస్థాయిలోనూ, సైద్ధాంతిక స్థాయిలోనూ ప్రస్ఫుటిస్తోంది. దానివల్ల దక్షిణాదిలో కూడా బీజేపీతో చేతులు కలిపేందుకు, దాని రాజకీయ సిద్ధాంతాన్ని ఆమోదించేందుకు పార్టీలు ఏ మాత్రం వెనుకాడడం లేదు. బీజేపీ వ్యతిరేకత సోషల్ మీడియా కాగితపు పులులకు మించి జనంలోకి వ్యాపించేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేము. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీనపడింది. అప్పుడు జనసంఘ్, బీజేపీ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే విధంగా మారింది. కేవలం రెండేళ్లలో బీజేపీ తూర్పున ఒడిషా, బిహార్, పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి రాగలిగింది. అసోంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో బీజేపీకి స్వంత ముఖ్యమంత్రులున్నారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. ఒక్క జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప హిందీ బెల్ట్ అంతటా బీజేపీ ముఖ్యమంత్రులున్నారు. పంజాబ్‌లో కూడా ఇప్పటికే బీజేపీ చాపక్రింద నీరులాగా ప్రవేశించేందుకు పథకాలు మొదలుపెట్టింది. ఉత్తర, తూర్పు, పశ్చిమాన ఆధిపత్యం నిరూపించుకోగలిగిన బీజేపీకి దక్షిణాదిలో ప్రవేశించడం అసాధ్యమా? అయితే ఎన్నికల రాజకీయాల్లో బీజేపీ ఎంత తలపండిపోయిందంటే ఆ పార్టీని ఓడించడం అసాధ్యమనే స్థితి ఏర్పడింది. ఎన్నికల్లో బీజేపీ విజయ సూత్రాన్ని ఎవరూ ఛేదించలేకపోతున్నారు. గెలిచేందుకు ఏ సాధనాన్ని బీజేపీ వదిలిపెట్టదు, అది నైతికమా, అనైతికమా అన్న చర్చతో ఆ పార్టీకి నిమిత్తం లేదు. 'సర్' వల్ల 31 స్థానాల్లో బీజేపీ తమపై గెలిచిందని తృణమూల్ కాంగ్రెస్ నేతలే అంగీకరించినందువల్ల మిగతా స్థానాల్లో గెలిచేందుకు బీజేపీ ఇతర వ్యూహాలు ప్రయోగించి ఉండాలి. ఏ పార్టీకైనా ఎల్లకాలమూ శిఖర స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. బీజేపీ ఆ స్థాయి కోల్పోవాలంటే తన పతనానికి తానే కారణం కావాలి. ఆ పార్టీని గద్దెదించగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవిర్భవించాలి. ప్రజలు అడుగడుగునా వ్యతిరేకించగల పరిస్థితులు రావాలి. ఈ మూడూ సమీప భవిష్యత్తులో జరిగే అవకాశాలు కనపడడం లేదు. సాధారణంగా ప్రభుత్వ పాలన పట్ల కనపడే వ్యతిరేకతను కూడా బీజేపీ అధిగమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలు. అసోంలో రెండుసార్లు అధికారంలో ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ బీజేపీని ఓడించకపోగా ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థి, మూడుసార్లు ఎంపీ అయిన గౌరవ్ గొగోయ్ కూడా 23వేల ఓట్ల తేడాతో ఓడిపోయారంటే ఏమనాలి? 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగే లోపు బీజేపీని ఓడించగల సత్తాను ప్రతిపక్షాలు ఎంత మేరకు సాధించగలుగుతాయో చెప్పలేం. కేరళలో వామపక్షాలను ఓడించి, బెంగాల్‌లో వామపక్షాలతో తృణమూల్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌తో జాతీయ స్థాయిలో ఎన్ని పార్టీలు కలిసి వస్తాయో చెప్పలేం.

# హిమంత్ కు కేంద్రంలో కీలక పదవి

**న్యూఢిల్లీ, మే 15:**అస్సాంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. హిమంత బిశ్వశర్మ వరుసగా రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మే 12న పదవీ బాధ్యతలు చేపట్టారు. బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడంతో ఆయన రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల మధ్య ప్రవేశం, విద్యా సంస్కరణలతో ప్రజా నేతగా ఎదిగిన హిమంత, సర్బానంద సోనోవాల్ ప్రభుత్వంలో మంత్రిగా విద్యా వ్యవస్థను బలోపేతం చేశారు. అధికారులు రాత్రి పాఠశాలల్లో ఉండేలా చేసిన వినూత్న చర్యలు విశేష ప్రశంసలు అందుకున్నాయి.ఎన్నికల ప్రచారంలో 'మోదీ ప్రభుత్వం' పాటలు, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, రన్నింగ్‌లతో వినూత్న వ్యూహాలు రూపొందించారు. 2019, 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నినాదం కీలకం. ఈ విధానాలు బీజేపీ గెలుపును నిర్ధారించాయి.హిమంతను బీజేపీ జాతీయ నాయకుడిగా



రూపొందిస్తోంది. మహారాష్ట్ర, హర్యాణ, గోవా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్ సీఎంలు 50 ఏళ్ల లోపు యువకులు. వీరు దీర్ఘకాలిక రాజకీయ భవిష్యత్తును సూచిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్ తర్వాత హిమంతకు అలాంటి ఇమేజ్ ఏర్పాటు జరుగుతోంది.నార్త్ ఈస్ట్‌లో బీజేపీ బలాన్ని పెంచిన హిమంత, యూపీ, జార్ఖండ్, ఒడిశా, బెంగాల్ ఎన్నికల్లో ప్రచారం చేశారు. హైదరాబాద్ వినాయక నిమజ్జనంలో పాల్గొన్నారు. అస్సాం--బెంగాల్ మధ్య శత్రుత్వాలను అధిగమించి, 'మామ' అనే స్నేహపూర్వక సంబోధన పొందారు. 1980ల వరకు బెంగాలీ--అస్సామీ గొడవలను ఏకం చేసిన ఆయన ప్రచార వ్యూహాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాయి. హిమంత యూపీ ఎన్నికల్లో ప్రచారం చేశాడు. లోక్‌సభ ఎన్నికల సమయంలో పలు రాష్ట్రాల్లో ప్రచారం చేశారు. హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనంలో పాల్గొన్నారు.హిమంత ప్రచారాలు యువతకు గుర్తింపు, జాతీయ అవకాశాలు కల్పిస్తున్నాయి. 2029 లేదా 2032 నాటికి జాతీయ నాయకుడిగా ఎదగడం ఖాయం. బీజేపీ యువ లీడర్‌షిప్ వ్యూహం ద్వారా పార్టీ భవిష్యత్తును బలోపేతం చేస్తోంది.

# యాక్టివ్ మోడ్ లోకి కొడాలి

**విజయవాడ, మే 15:**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అవకాశం ఉన్నంతవరకు కూటమి పార్టీల్లో చేరిపోయారు. అయితే ఆ ఛాన్స్ లేని వారంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయారు. కానీ చాలామంది నేతలు పెద్దగా యాక్టివ్ గా లేరు. గతంలో దూకుడుగా ఉన్న నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సైలెంట్ పాటిస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి కొడాలి నాని అయితే రాజకీయాలకు దూరంగా కనిపిస్తున్నారు. అయితే తాజాగా ఆయన జగన్మోహన్ రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు. కీలక చర్చలు జరిపారు. దీంతో పార్టీలో కొడాలి నాని యాక్టివ్ అవుతారు అన్న టాక్ వినిపిస్తోంది. గుడివాడలో మాత్రమే కాదు కృష్ణా జిల్లా పార్టీ బాధ్యతలను తీసుకుంటారని తెలుస్తోంది. అదే జరిగితే ఆయన మునుపటి మాదిరిగా దూకుడు ప్రదర్శించే అవకాశం ఉందిమొన్నటి ఎన్నికల్లో గుడివాడ నుంచి ఐదోసారి పోటీ చేసిన కొడాలి నాని కి భారీ ఓటమి ఎదురయింది. అప్పటివరకు తనను ఓడించే నాయకుడు ఎవడు అంటూ బహిరంగంగానే సవాల్ విసురుతూ వచ్చారు. ముఖ్యంగా చంద్రబాబు తో పాటు లోకేష్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకునేవారు. ఈ క్రమంలో ఆయన నోటి నుంచి వచ్చే బూతులు జుగుప్సాకరంగా ఉండేవి. ఆయన వ్యాఖ్యలను ఎక్కువ మంది తప్పు పట్టేవారు. అయితే ఏపీలో వైసిపి ఓడిపోయి కూటమి రావడంతో కొడాలి నాని కి షాక్ తప్పలేదు. ఆయన అరెస్టు కచ్చితంగా ఉంటుందన్న ప్రచారం నడిచింది. కానీ ఎంత లోనే ఆయన అనారోగ్యానికి గురయ్యారు. గుండె నొప్పితో ముంబైలోని ఓ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొందారు. తరువాత కొద్ది రోజులపాటు హైదరాబాదులోని ఇంటికి పరిమితం అయ్యారు. కోలుకోవడంతో తిరిగి పార్టీలో యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపించింది. తాజాగా విదేశీ పర్యటన నుంచి తాడేపల్లి కి చేరుకున్న జగన్మోహన్ రెడ్డిని కలిశారు కొడాలి నాని. వారిద్దరి మధ్య కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కృష్ణా జిల్లాలో టిడిపి కూటమి బలంగా ఉంది. చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇటువంటి సమయంలో సరైన నాయకత్వం అవసరం. అందుకే కొడాలి నానిని జగన్మోహన్ రెడ్డి పిలిచి మాట్లాడినట్లు తెలుస్తోంది. గుడివాడ నియోజకవర్గంలో క్రియాశీలకం కావడంతో పాటు కృష్ణాజిల్లా బాధ్యతలను తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి సూచించారట. మునుపటిలా దూకుడుగా వ్యవహరించాలని



ఆదేశించారట. అయితే అందుకు నాని సరేనన్నారట. అయితే అరెస్టు ఉంటుందన్న భయంతో కొడాలి నాని ఉన్నారట. ఎందుకంటే ఆయన స్నేహితుడు వల్లభనేని వంశీ మోహన్ దాదాపు 150 రోజులపాటు జైలు జీవితం అనుభవించారు. అనారోగ్యానికి గురయ్యారు. తనకు అటువంటి పరిస్థితి వస్తుందని కొడాలి నాని కి తెలుసు. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి సూచిస్తున్నట్టు యాక్టివ్ అవుతారా? లేదా? అనేది చూడాలి.

# రోడ్డు పక్కన వాహనాలు పార్క్ చేస్తున్నారా..

## బీకేర్‌ఫుల్, తెలంగాణలో కొత్త రూల్స్!

**హైదరాబాద్, మే 15:**తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు.ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ



పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది.నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఎవరైనా వాహనాలను రోడ్లపై వదిలేసి వెళితే గతంలో జరిమానా విధించేవారు.. ఇకపై అలా కాదు జరిమానాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. టోయింగ్ ఛార్జీలను కూడా వాహన యజమాని చెల్లించాల్సి ఉంటుంది.. అంతేకాదు ఆ వాహనాన్ని పోలీసుల దగ్గర ఉంచిన అన్ని రోజులకు పార్కింగ్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ వాహనంపై ఏవైనా పెండింగ్ చలాన్లు ఉన్నా ఇతర డాక్యుమెంట్లకు సంబంధించి ఏవైనా జరిమానాలు ఉన్నా చెల్లించాల్సిందే. ఒకవేళ వాహన యజమాని నెల నుంచి 45 రోజుల్లో క్లెయిమ్ చేయకపోతే ఆ వాహనాన్ని వేలానికి పంపే అవకాశం ఉంటుంది. వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన సమయంలో, బ్రేక్‌డౌన్ అయిన సందర్భంలో..ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో వాహనాల్ని టోయింగ్ చేయాలని రవాణాశాఖ ముసాయిదాలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఈ వాహనాలు టోయింగ్, పార్కింగ్ ఫీజులకు సంబంధించి కూడా రవాణాశాఖ ఛార్జీలను ప్రతిపాదించింది. నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా ఈ ఛార్జీలు వేర్వేరుగా ఉన్నాయి. ఈ వాణాలను పార్క్ చేసేందుకు కొత్తగా పీపీపీ (ప్రభుత్వ ప్రైవేట్) భాగస్వామ్యంలో పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ వాహనాలకు నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలను బట్టి రోజువారి పార్కింగ్ ఫీజులు నిర్ణయించిన్లు తెలుస్తోంది. బైక్‌లకు రోజుకు రూ.20 నుంచి 30, ఆటోలకు రూ.35 నుంచి 50, కార్లకు రూ.60 నుంచి 80, బస్సులకు రూ.200 నుంచి రూ.300 రోజుకు చెల్లించాలని ముసాయిదాల రవాణాశాఖ ప్రతిపాదించింది.ప్రస్తుతం ముసాయిదా దశలో ఉన్న ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తుది మార్పులతో అమలు చేయనుంది.

# రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

**న్యూఢిల్లీ, మే 15:**భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఇప్పుడు మూడో దశకు చేరుకుంది. ఈసీ వెలువరించిన తాజా ఆదేశాల ప్రకారం.. పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, హర్యానాతో పాటు తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం 16 రాష్ట్రాలు , 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. గతేడాది బీహార్‌లో ప్రారంభమైన ఈ స్పెషల్ రివిజన్, ఇప్పుడు దేశంలోని మెజారిటీ రాష్ట్రాలకు విస్తరించింది.ఈ మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల డేటాను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం సుమారు 3.94 లక్షల మంది బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామాలు మారిన వారి వివరాలను సరిచేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, డూప్లికేట్ ఎంట్రీలను ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్న వాటిని తొలగించడం ఈ డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యం. రాజకీయ పార్టీలు కూడా తమ తరపున 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ఈ ప్రక్రియను పర్యవేక్షించవచ్చు.ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని, ఈ ూ×= షెడ్యూల్‌ను ఈసీ ఖరారు చేసింది. రెండింటికీ ఒకే రకమైన యంత్రాంగం అందుబాటులో ఉండటం వల్ల పనులు వేగంగా పూర్తవుతాయని కమిషన్ భావిస్తోంది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ , లడఖ్ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, సెన్సస్ ఫేజ్-2 పనుల దృష్ట్యా, అక్కడ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఈసీ స్పష్టం చేసింది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ మే నెలాఖరు నాటికి ముమ్మరం కానుంది. ఇప్పటికే మొదటి రెండు దశల్లో భాగంగా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రత్యేక ప్రక్షాళన పూర్తయింది. అక్కడ సుమారు 59 కోట్ల మంది ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. తాజా మూడో దశతో కలిపి దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి రానుంది. ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ లింకింగ్ వంటి అంశాలపై కూడా ఈ సమయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ ప్రాధాన్యతని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొని, బూత్ స్థాయిలో సహకరించాలని ఈసీ కోరింది. 2027లో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందే లోప రహిత ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలనే పట్టుదలతో కమిషన్ ఈ భారీ కసరత్తును నిర్వహిస్తోంది

# బ్రాండ్ పేరిట బరితెగింపు!

**మెదక్, నల్గోండ, మే 15:** పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, వారి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన అంగన్వాడీ కేంద్రాలు ఇప్పుడు అవినీతి తిమింగలాలకు కాసుల కురిపించే కేంద్రాలుగా మారాయి. నల్లగొండ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల సరఫరా పేరుతో లక్షల రూపాయల ప్రజాధనాన్ని నిలువునా ముంచేశారు. బ్రాండెడ్ వస్తువుల ధరలు చూపించి.. నాసిరకం మోడళ్లను అంటగడుతూ దాదాపు రూ.10 లక్షల మేర చేతివాటం ప్రదర్శించిన వైనం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్ గా మారిందనే ప్రచారం జోరుగా సాగుతుంది.వాస్తవానికి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో అంగన్వాడీల రూపురేఖలు మార్చాలని భావిస్తే, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం ఆయన ఆశయాలకు తూట్లు పొడిచినట్లు తెలుస్తుంది. మినరల్ ఫండ్స్ నిధులను మళ్లించేందుకు వేసవి సెలవులను అస్త్రంగా చేసుకున్న అక్రమార్కులు, బినామీ టెండర్లతో ఐసీడీఎస్ కార్యాలయాన్నే అవినీతికి అడ్డాగా మార్చేశారు. రూ. 2200 ఫ్యాన్కు బిల్లు పెట్టి రూ. 1400 వస్తువును సరఫరా చేస్తూ నయా స్కామ్కు తెరలేపారని జిల్లాలో జోరుగా చర్చలు సాగుతున్నాయి.నల్లగొండ జిల్లాలోని 802 అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, 1060 కేంద్రాలకు ట్యూబ్లైట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ మినరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.20 లక్షలు కేటాయించారు. అయితే కాంట్రాక్ట్ నిబంధనలను సదరు కాంట్రాక్టర్ తుంగలో తొక్కినట్లు తెలుస్తుంది. టెండర్ ప్రకారం రూ. 2,243 విలువైన 'క్రాంప్టన్ హైస్పీడ్ హెచ్పీ



ప్లస్' మోడల్ సరఫరా చేయాలి. కానీ వాస్తవికంగా సరఫరా అయింది మాత్రం కేవలం రూ. 1,400 విలువ చేసే 'సీవైండ్' మోడల్. అంటే ప్రతి ఫ్యాన్ మీద రూ. 843 నొక్కేసినట్లు విశ్వసనీయ సమాచారం.అంటే ఒక్క ఫ్యాన్ల కొనుగోలులోనే రూ. 7 లక్షల కుంభకోణం జరిగినట్లు అంచనాలు వేస్తున్నారు. ఇదే సమయంలో రూ. 264 విలువైన 'ఫిలిప్స్ 3-ఇన్-1 ఎల్ఈడీ' లైట్లకు బదులుగా, మార్కెట్లో కేవలం రూ. 110 లకే దొరికే అత్యంత నాసిరకమైన స్లిమ్ మోడళ్లను సరఫరా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో దాదాపు రూ. 2 లక్షల నిధులు పక్కదారి పట్టాయనీ స్థానికంగా వినిపిస్తుంది సాధారణంగా ఏప్రిల్లో జరగాల్సిన సరఫరాను కావాలనే వేసవి సెలవుల వరకు సాగదీసినట్లు సమాచారం. అంగన్వాడీ కేంద్రాలు మూసి ఉంటే.. ఎవరూ క్వాలిటీని తనిఖీ చేయరనేది వీరి మాస్టర్ ప్లాన్. జిల్లా కొనుగోలు కమిటీ పర్యవేక్షణ లేకుండానే మెటీరియల్ను నేరుగా సెక్టార్ ఆఫీసులకు పంపించి, సూపర్వైజర్ ల ద్వారా సంతకాలు చేయించుకోవడం వెనుక పెద్ద నెట్వర్కే ఉందనేది అందరు గమనిస్తున్న విషయమే.ఈ మొత్తం స్కామ్ వెనుక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఒక డిప్యుటేషన్ ఉద్యోగి పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి నకిరేకల్ పరిధిలో ఉండాల్సిన ఆ వ్యక్తి, జిల్లా ఆఫీసులో చక్రం తిప్పుతూ హైదరాబాద్కు చెందిన తన బినామీలతో టెండర్లు వేయించి ఈ దోపిడీకి తెరలేపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సంగారెడ్డి జిల్లాలో అంగన్వాడీలను అభివృద్ధి చేసిన అనుభవంతో నల్లగొండలోనూ అదే మార్పు తేవాలని వాస్తవికంగా కలెక్టర్ భావించి ఫిట్టింగ్ చార్జీలు కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చి మరీ నిధులు కేటాయిస్తే.. క్షేత్రస్థాయిలో యంత్రాంగం మాత్రం ఆయన నమ్మకాన్ని వమ్ము చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయినాణ్యత లేని ఫ్యాన్లు, ట్యూబ్లైట్ల వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? కేవలం కమీషన్ల కోసం చిన్నారుల సౌకర్యాలను తాకట్టు పెట్టిన ఈ నిధుల వేటగాళ్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమార్కుల నుంచి కాజేసిన నిధులను రికవరీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు బలంగా కోరుతున్నారు. అలాగే అవినీతి తంతుకు తెరలేపిన వ్యక్తులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

# సనత్ నగర్ టిమ్స్ ను సందర్శించిన కేటీఆర్...

**హైదరాబాద్:**బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన 1000 పడకల సనత్ నగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లడుతూ హైదరాబాద్ నగర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక టిమ్స్ హాస్పిటల్స్ అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్లో ఎయిమ్స్ స్థాయి వైద్యం అందించేలా టిమ్స్ను ఆలోచించి రూపకల్పన చేశాం అని అన్నారు. సనత్నగర్ టిమ్స్ కోసం 22 ఎకరాల విస్తీర్ణాన్ని వినియోగించామని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీ, ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్తో హాస్పిటల్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్ను తీసుకువచ్చిందన్నారు.



హైదరాబాద్లో సనత్నగర్, ఎల్బీనగర్, ఆల్వాల్ ప్రాంతాల్లో టిమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వరంగల్లో 2000 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రిని, నిమ్స్ ఆసుపత్రిని కూడా భారీ స్థాయిలో విస్తరించామని చెప్పారు. సనత్నగర్ టిమ్స్లో మొత్తం మూడు బ్లాకులు నిర్మించాం. 300 ఐసియూ బెడ్స్తో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. రోగుల బంధువుల కోసం ప్రత్యేక ధర్మశాల ఏర్పాటు, రూ. 1200 కోట్ల వ్యయంతో టిమ్స్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు.కేసీఆర్ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేది అని వ్యాఖ్యానించారు. 16 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశాం. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సహా అన్ని డయాగ్నస్టిక్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేక వీఐపీ సూట్స్ కూడా ఏర్పాటు, కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలు జరిగేలా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.దేశంలోనే అత్యధిక వైద్య సిబ్బందితో కూడిన ప్రభుత్వ వైద్య వ్యవస్థగా టిమ్స్ను అభివృద్ధి చేస్తున్నాం. ప్రత్యేక రీసెర్చ్ బ్లాక్స్, అకాడెమిక్ సదుపాయాలు కూడా ఏర్పాటు, భారీ ఆడిటోరియం నిర్మాణం కూడా చేపట్టినట్లు తెలిపారు.

# గులాబీ జోరు అందుకుంటుందా..?

**హైదరాబాద్, మే 15:**తెలంగాణాకు మోడీ వచ్చి సగం రోజు అక్కడే ఉండి చేసిన రాజకీయ కలకలం అంతా ఇంతా కాదు, సీఎం రేవంత్ రెడ్డిని తమతో కలవమని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దాంతో ఎవరికి తోచిన విధంగా వారు దీని మీద విశ్లేషించి రచ్చ చేశారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్డీయే బలోపేతం మీద మోడీ మిత్రులతో చర్చించారు అన్న వార్తలతో అటు ఆంధ్రాలో వైసీపీ ఇటు తెలంగాణాలో బీఆర్ఎస్ కూడా ఉలిక్కిపడి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ లోకి దిగిపోతున్నాయి. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది అని అంటున్నారు. ఈ మీటింగ్ వేరీ సీరియస్ గానే సాగింది అని అంటున్నారు. ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని




కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కూడా లోతైన చర్చ సాగింది అని అంటున్నారు. బీఆర్ఎస్ ని పూర్తిగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధినాయకుడు కేసీఆర్ పార్టీ వర్గాలకు సూచించారు అని అంటున్నారు. గతానికి భిన్నంగా తెలంగాణా రాజకీయం మారుతోంది అని బీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. బీజేపీ తెలంగాణాలో అధికారం విషయంలో గట్టి పట్టుదలతో ఉందని కూడా అర్థం అవుతోంది. మోడీ బహిరంగ సభలో అయితే వచ్చేది బీజేపీనే అని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. బీజేపీ కనుక ఒక చోట అధికారంలోకి రావాలనుకుంటే - మిగతా3లో

## ఇందిరమ్మ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి
# సబ్ కమిటీలో చోటు కల్పించాలి

- మొదటి పేజీ తరువాయి

న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (జేఏసీ) అధ్యక్షుడు కేసరి వెంకటేశ్వర్ రావు, సొసైటీ అధ్యక్షుడు కె.ఎ.విజయరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి లకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారి కార్యాలయాలకు కూడా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పత్రికలు నిర్వహించే ఎడిటర్లు, జర్నలిస్టులు మరియు ఇప్పటివరకు ఏ హౌసింగ్ సొసైటీలో సభ్యత్వం లేని వారితో కలిసి ఇందిరాగాంధీ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సొసైటీలో 150 మందికి పైగా సభ్యులు ఉన్నారని, వారిలో అనేక మంది 20 సంవత్సరాలకు పైగా జర్నలిజం రంగంలో సేవలందిస్తున్నారని వెల్లడించారు. సీనియార్టీ ఆధారంగా ఇంటి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అయితే జర్నలిస్టుల సమస్యలు, అవసరాలపై సరైన అవగాహన కలిగిన తమ సొసైటీని కూడా కమిటీలో భాగస్వామ్యం చేస్తే పారదర్శకంగా, న్యాయంగా స్థలాల కేటాయింపు జరిగేటట్లు కృషి చేస్తమని వారు అభిప్రాయపడ్డారు. అనేక మంది జర్నలిస్టులు జీవితాంతం అద్దె ఇళ్లలోనే గడుపుతున్నారని, తక్కువ ఆదాయంతో కుటుంబాలను పోషిస్తూ సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ఇంటి స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో సొసైటీ డైరెక్టర్‌లు ఎ.కృష్ణారెడ్డి, గోలి సమ్మిరెడ్డి తదితరులు వున్నారు.

# తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

- మొదటి పేజీ తరువాయి

జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**పటాన్‌చెరులో మొదటగా పరిశ్రమలు ఏర్పడ్డాయి: దామోదర రాజనర్సింహ**

ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

**సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలు తీసుకువచ్చాం: జగ్గారెడ్డి**

మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు దీఎజూ, దీణా, ాణఖీ లాంటి కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

# 'చేప ప్రసాదం' కోసం సిద్ధమవుతున్న హైదరాబాద్

- మొదటి పేజీ తరువాయి

ఉన్నందున, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ మేనేజ్మెంట్, క్యూ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలుగా బత్తిన గౌడ్ కుటుంబం



ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనాన్ని ఇస్తుందని భక్తుల నమ్మకం. ఒక చిన్న బతికున్న చేప పిల్ల నోటిలో మూలికా మిశ్రమాన్ని ఉంచి, దానిని రోగి చేత మింగిస్తారు. చేపలు తీసుకోని వారి కోసం బెల్లంతో కలిపిన ప్రత్యేక మూలికా మిశ్రమాన్ని అందిస్తారు.

# గులాబి జోరు అందుకుంటుందా..?

- మొదటి పేజీ తరువాయి

దానికి సంబంధించి గ్రౌండ్ వర్క్ చాలా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ ఘన విజయం. అసలు ఓటమి లేదు అనుకున్న మమతా బెనర్జీ ఓటమి పాలు అయ్యారు. దాంతో అంతకంటే బలమైన ప్రాంతీయ పార్టీల నేతలు ఎవరూ లేరని అంటున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కూడా పూర్తి స్థాయిలో అలెర్ట్ అవుతోంది అని అంటున్నారు ఇక బీఆర్ఎస్ ని బూత్ లెవెల్ నుంచి గ్రామ వార్డు స్థాయి నుంచి కమిటీలతో నింపాలని నిర్ణయించారు. అలాగే నియోజకవర్గం స్థాయి జిల్లా స్థాయి వరకూ కూడా బలమైన సమర్థులైన నాయకులతో పార్టీని పటిష్టం చేయాలని కూడా నిర్ణయించారు ఇక పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహం నింపాలని రానున్న రోజులలో నేతలంతా జనంలో ఉంటూ బీఆర్ఎస్ ని పరుగులు పెట్టించాలని కూడా తీర్మానించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికలు జరిగినా విజయమే పరమాధిగా పార్టీ పోరాడాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి 2028 ఎన్నికలకు బీజేపీ రెడీ అని మోడీ గట్టిగా చెప్పి వెళ్లారు. దాంతో బీఆర్ఎస్ కూడా జోరు చేస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి రానున్న రోజులలో బీఆర్ఎస్ స్పీడ్ ఏ విధంగా ఉంటుందో.

# అప్పుల పాలవుతున్న జీహెచ్ఎంసి

- మొదటి పేజీ తరువాయి

చేయాలని నిర్ణయించింది.తెలంగాణ వార్తలు ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన భారీ బకాయిలను వన్ టైమ్ సెటిల్ మెంట్ ద్వారా చెల్లించడం.. అప్పుల భారాన్ని తగ్గించాలని ఇటీవల కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. అయితే ఇప్పటి వరకు ఎ లాంటి అధికారిక జీవో వెలువడలేదు. ఈ తరుణంలోనే ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన ఆస్తి పన్నును ఓటీఎస్ ద్వారా సర్దుబాటు చేయడం ద్వారా మూడు కార్పొరేషన్లకు సుమారు రూ. 1,686 కోట్లు తక్షణమే అందుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు..మిగిలిన దాదాపు రూ.3వేల కోట్ల అప్పులు ఏడాది కాలంలో ఒక్క జీహెచ్ఎంసీతోనే ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జీహెచ్ఎంసీకి ఆరేండ్లుగా రావాల్సిన స్టాంపు డ్యూటీ రూ.3,030 కోట్లను గతేడాది జనవరి నెలలో రిలీజ్ చేసింది. మొత్తం రూ. 3,169 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో స్టాంప్ డ్యూటీకి సంబంధించి రూ. 3030 కోట్లు, మ్యూటేషన్ ఫీజుల కింద రూ. 139 కోట్లు రావాల్సి ఉండగా, ఇందులో స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని బల్ది యా పర్సనల్ డిపాజిట్స్ (పీడీ) అకౌంట్‌లో జమ చేసింది. అయితే ఈ నిధులను రెవెన్యూ ఖర్చు కోసం మాత్రమే వినియోగించాలని నిబంధన పెట్టింది.డెవలప్‌మెంట్‌కు ఒకేసారి వాడుకునేందుకు వీలులేకపోవడం, ఉద్యోగుల జీతాలు, మెయింటనెన్స్ లోన్ల రీ పేమెంట్స్ కోసం వినియోగించారు. మొత్తంగా రూ. 1000 కోట్లను మాత్రమే వినియోగించుకున్నారు. ఇంకా నెలవారీగా ఈ నిధులను రెవెన్యూ ఖర్చులకు వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్న తరుణంలో, కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో తీసుకున్నట్లుగా సర్కారు బల్దియా ఈ నిధులను వెనక్కి తీసుకున్న కోలుకోని షాక్‌కు గురి చేసింది. ఉన్న ఫళం గా రూ. 2వేల కోట్లకు పైగా లాగేసుకుని కనీసం ఆ ప్రస్తావన తీసుకురాకపోవడంపై తీవ్రంగా మండిపడుతున్నారు.జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విడగొట్టి, ఒకో దానికి రూ. 500 కోట్లు ఇస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు..ఆ హామీని గాలికి వదిలేశారు. స్పెషల్ ఆఫీసర్ జయేశ్ రంజన్ ప్రతి కార్పొరేషన్‌కు రూ. 500కోట్ల మేర నిర్వహణ ఖర్చులకు ఇస్తామని ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో కనీసం నయా పైసా కేటాయింపులు జరపలేదు. ఫలితంగా నగర శివారులోని 27 పురపాలికలను జీహెచ్ఎంసీలో కలపడం ద్వారా ఆ ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయన్న ఆశలు ఆవిరైపోయాయి. విలీనం ముందు బడంగ్‌పేట, నార్సింగి, మణికొండ పురపాలికలు ప్రతి ఏటా రూ.200కోట్ల మేర సర్‌ప్లస్‌లో బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు మౌలిక వసతుల కల్పనపై తీవ్ర ప్రభావం పడుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

# బండి వ్యవహారంపై అధిష్టానం ఆరా...

- మొదటి పేజీ తరువాయి

మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు.. మాజీ ఎంపీ..ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతాన్ని కూడా జతకలిపి మీడియాలో పెద్ద ఎత్తున చర్చలు, వివరణలు, వార్తలు ప్రసారం చేశారు. ఈ పరిణామం జరుగుతున్న క్రమంలోనే కేంద్ర మహిళా కమిషన్ తోపాటు.. కేంద్ర హోం శాఖ(దీనిలోనే బండి సంజయ్ సహాయ మంత్రిగా ఉన్నారు) ఆరా తీసినట్టు కూడా మీడియా వెల్లడించింది. నిజానికి ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి కాబట్టి సరిపోయిందని.. లేకపోతే.. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఈ వ్యవహారమే బీజేపీని ఇరుకున పెట్టి ఉండేదన్న చర్చ కూడా జరిగింది. ఇదిలావుంటే.. అసలు ఏం జరిగిందన్న విషయంపై కేంద్ర హోం శాఖ వర్గాలు కూడా ఆరా తీశాయి. దీనిపై తెలంగాణ డీజీపీని నివేదిక కోరే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు.. కేంద్ర మంత్రి బండి నుంచి కూడా వివరణ తీసుకుంటారన్న చర్చ జరిగింది. ఎలా చూసుకున్నా.. బండి కుమారుడి వ్యవహారం ఢిల్లీ వరకు చేరడం గమనార్హం. ఈ విషయంలో తన కుమారుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బండి సంజయ్ చెబుతున్నారు. దీనిని తొలుత రాజకీయ కుట్రగా ఆయన పేర్కొన్నా.. తరువాత తప్పు చేసి ఉంటే.. తన కుమారుడైనా శిక్షకు అర్హుడే అన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు.. కేంద్రంపై టీపీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం..




**హైదరాబాద్:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఆగ్రహించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నాయని, దేశంలో మాత్రం పెట్రోల్ రేట్లను పెంచి కేంద్రం దోచుకుంటోందని మహేశ్ గౌడ్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వ చర్యలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందన్నారు. చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. ప్రజా సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ఫోన్ ఛార్జర్ కావాలంటూ ఇంట్లోకి వెళ్లి.. బాలికపై..



**వికారాబాద్, మే 15:** జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. తాండూరు నియోజకవర్గం యాలాల మండల పరిధిలో ఓ బాలికపై ఫర్హాన్ అనే యువకుడు అమానుషానికి ఒడిగట్టాడు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, పథకం ప్రకారం బాలిక ఉన్న చోటికి చేరుకున్నాడు. మొదట దాహం వేస్తుందని నీళ్లు అడిగిన నిందితుడు, ఆపై ఫోన్ ఛార్జర్ కావాలంటూ సాకుతో ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జరిగిన దారుణాన్ని బాలిక.. తన కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు ఫర్హాన్‌పై పోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## బండి బగీరథ్ వ్యవహారం.. లేఖ విడుదల చేసిన బాధితురాలి తల్లి

**బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు**

**శారీరక సంబంధాల కోసం తన కుమార్తెను ఒత్తిడి చేశాడన్న బాధితురాలి తల్లి**

**చాట్స్, మెసేజ్‌లు వంటి డిజిటల్ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడి**




కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై బాధితురాలి తల్లి లేఖ విడుదల చేశారు. ఈ లేఖలో పలు సంచలన విషయాలను ఆమె వెల్లడించారు. తమది ఒక సాదాసీదా మధ్యతరగతి కుటుంబమని, ఎటువంటి రాజకీయ ప్రచారాల కోసం కాకుండా కేవలం తన కుమార్తెకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ముందుకు వచ్చామని బాధితురాలి తల్లి స్పష్టం చేశారు. 2025లో బండి భగీరథ్‌తో తన కుమార్తెకు పరిచయం ఏర్పడిందని, ఆ తర్వాత అతడు ఆమెను శారీరక సంబంధాల కోసం తీవ్రంగా ఒత్తిడి చేశాడని ఆరోపించారు. ముఖ్యంగా 2025 డిసెంబర్ 31 రాత్రి మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటనలను ఆమె వివరించారు. అక్కడ మద్యం సేవించమని బలవంతం చేసి, తన కుమార్తె పట్ల భగీరథ్ అత్యంత అనుచితంగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన చాట్స్, మెసేజ్‌లు వంటి అన్ని డిజిటల్ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, నిందితుడు క్షమాపణలు కోరిన సందేశాలు కూడా అందులో ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఈ ఏడాది మే 8న తాము పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించామని, మైనర్ బాలికకు సంబంధించిన కేసు అయినప్పటికీ ఫిర్యాదు నమోదు చేయడానికి పోలీసులు సుమారు ఐదు గంటల పాటు నిరీక్షించేలా చేశారని ఆమె పేర్కొన్నారు. తాము ఒత్తిడి చేసిన తర్వాతే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ఆపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుతో విచారణ వేగవంతమైందని చెప్పారు. ప్రస్తుతం భగీరథ్‌పై కఠినమైన నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. కాగా, పోలీసుల నోటీసులకు స్పందించిన భగీరథ్, విచారణకు హాజరయ్యేందుకు రెండు రోజుల సమయం కోరారు. ఈ వ్యవహారంలో పరోక్షంగా రాజీ ప్రయత్నాలు, బెదిరింపులు వచ్చాయని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఏప్రిల్ 23న తాము స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసినప్పటికీ, తమకు భరోసా లభించకపోగా భయాందోళనలకు గురిచేశారని ఆమె లేఖలో పేర్కొన్నారు. తమ కుటుంబంపై రివర్స్ కేసులు (బ్లాక్‌మెయిల్ ఆరోపణలు) పెట్టి నిందితుల్లా చూపే ప్రయత్నం జరిగిందని వాపోయారు. ప్రస్తుతం తమకు సోషల్ మీడియాలో జరుగుతున్న టార్గెటింగ్ నుండి రక్షణ కల్పించాలని, స్వతంత్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని ఆమె మహిళా కమిషన్, న్యాయవ్యవస్థను వేడుకున్నారు.

## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!: కవిత ఆసక్తికర వ్యాఖ్య

**కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత**

**పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య**

**అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత**



ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు...



**హైదరాబాద్, మే 15:**తెలంగాణలో కొత్తగా మరికొన్ని నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇతర ప్రాంతాలకు సంబంధించి మెగా గ్రోత్ కారిడార్‌ల్లో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు సూచించారు. రాష్ట్రంలో మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి, వాటి ప్రణాళికలపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.'మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ గ్రోత్ కారిడార్ ఏర్పాటు ప్రణాళికలు రూపొందించాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్‌ను, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు కావాలి. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలి. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో పాటు ఇతర అంశాలన్నీ గ్రోత్ కారిడార్లలో స్పష్టంగా ఉండాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.'తెలంగాణలో రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి ప్రణాళికలు, పనులు చేపట్టాలి. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారుతాయి. ఆ విమానాశ్రయానికి కావలసిన నీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌ను రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతుంది. గ్రోత్ కారిడార్లలో వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రతిదీ డిజైన్ చేయాలని స్పష్టంగా ఉండాలి. నగరాల్లో ఖర్చును తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలి. లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీ వాహనాలే ఉండాలి. ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా ప్రణాళికలు ఉండాలి' అన్నారు.'మున్సిపాలిటీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలి. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలి. నగరాలు, పట్టణాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఏఐ వినియోగం కోసం సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలి. భూగర్భ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, ఎస్టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాల పైన ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి' అని ముఖ్యమంత్రి సూచించారు

# ఇంటర్ విద్యలో భారీ మార్పులు



**హైదరాబాద్, మే 15:**ఇంటర్ విద్యలో కీలక మార్పులుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమలు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మొత్తంగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. సైన్స్ విద్యార్థులకు గతంలో ఉన్న 30 మార్కుల ప్రాక్టికల్స్ విధానాన్ని రెండు సంవత్సరాలకు విభజించింది. ఇకపై ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.ప్రాక్టికల్స్ పరీక్షలకు ఫస్ట్ ఇయర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కులు కేటాయించనున్నారు. గణితంలోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. గణితంలో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ (థియరీ) పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్నల్ అసెస్మెంట్‌కు ఒక్కో ఏడాదికి అంటే ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు 15 మార్కులు చొప్పున కేటాయించనున్నారు. అదేవిధంగా హ్యుమానిటీస్‌లో కూడా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు. ఫైనల్ థియ రీ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహించనున్నారు. భాషా (లాంగ్వేజెస్) సబ్జెక్టులలోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్మెంట్‌కు కేటాయించనున్నారు. ఎంఈసీ మ్యాథమెటిక్స్‌కు గతంలో ఇంటర్నల్ అసెస్మెంట్ ఉండేది కాదు. 75 మార్కులకు థియరీ పరీక్షే ఉండేది. కానీ ఇప్పుడు 20 మార్కులను ఇంటర్నల్ అసెస్మెంట్‌కు, 80 మార్కులు థియరీ పరీక్షకు కేటాయిస్తారు. అలాగే ఎంఈసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గణిత ప్రశ్నపత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సంస్కరణల నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను కూడా సవరించింది. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం సవరించిన సిలబస్‌తో కూడిన పుస్తకాలను నిపుణుల కమిటీ పర్యవేక్షణలో రూపొందించారు. ఈ కొత్త పుస్తకాల్లో డయాగ్రామ్స్, నాలెడ్జ్ బాక్సులు, క్యూఆర్ కోడ్లు, భారతీయ జ్ఞాన వ్యవస్థలకు సంబంధించిన సమాచారాన్ని చేర్చారు. విద్యార్థులకు ఈ పుస్తకాల పంపిణీని జూన్ 1వ తేదీ లోపు పూర్తిచేస్తామని, గతేడాది కంటే తొందరగానే ఈసారి పంపిణీ ప్రక్రి య పూర్తిచేస్తామని ఇంటర్ బోర్డు స్పష్టంచేసింది. ఈసారి నుంచి ఏసీఈ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) పేరుతో కొత్త గ్రూపును బోర్డు ప్రవేశపెడుతోంది. జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ఈనెల 12 నుంచే ప్రారంభమైంది.

**ఇంటర్ విద్యలో చేసిన మార్పులు ఇవే..**

ఇకపై ఫీజిక్స్, కెమిస్ట్రీ, బొటనీ, జువాలజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలోను ప్రాక్టికల్ పరీక్షలు.

మొదటి సంవత్సరంలో 15 మార్కులు, రెండో ఏడాది 15 మార్కులకు ప్రాక్టికల్స్.

మ్యాథ్స్‌లో యాక్టివిటీ బేస్డ్ లర్నింగ్

మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ఇంటర్నల్ అసెస్మెంట్‌కి ఒక్కో ఏడాదికి 15 మార్కులు కేటాయింపు.

మ్యాథమేటిక్స్‌లో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలు.

హ్యూమానిటీస్ సబ్జెక్టులోను యాక్టివిటీ బేస్డ్ లర్నింగ్‌కి 20 మార్కులు.

ఫైనల్ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహణ.

భాషా విభాగాల్లోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్మెంట్.

# హరీష్ పార్టీకి దూరమౌతున్నారా...

**మెదక్, మే 15** :హరీష్ రావు తాను అమెరికా వెళ్తున్నట్లుగా ప్రకటించారు. కొన్నాళ్లు అక్కడే ఉంటానని కూడా సోషల్ మీడియాలో తెలిపారు. ఎన్నాళ్లన్నది చెప్పలేదు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలతో సహజంగానే హరీష్ రావు అమెరికా పర్యటన బీఆర్ఎస్‌లో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గతంలో కవిత కూడా అలా అమెరికా పోయినప్పుడు ఇక్కడ చాలా జరిగాయి. ఆమె వచ్చే సరికి.. ఆమెకు, పార్టీకి మధ్య పూడ్చలేనంత గ్యాప్ వచ్చింది. చివరికి అది సొంత పార్టీ ప్రకటనకు దారి తీసింది. కొద్ది రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ రావు వర్గానికి మధ్య కోల్డ్ వార్ నడుస్తోందనే వార్తలు వెబ్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీ పగ్గాల విషయంలో గానీ, భవిష్యత్తు కార్యాచరణలో గానీ హరీష్ రావును పక్కన పెడుతున్నారనే అసంతృప్తి ఆయన అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. హరీష్ రావు రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. బండి సంజయ్ కుమారుడి కేసును బీఆర్ఎస్ సీరియస్ గా రాజకీయం చేస్తే హరీష్ రావు మాత్రం ఏమీ మాట్లాడలేదు. సరిగ్గా ఇటువంటి కీలక సమయంలో హరీష్ రావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండి అమెరికా వెళ్లడం, ఆయన మౌన ముద్ర వేయబోతున్నారా? లేక పార్టీ వ్యవహారాల నుంచి కొద్దిరోజులు విరామం కోరుకుంటున్నారా? అన్న సందేహాలు పార్టీ క్యాడర్‌కు వస్తున్నాయి.హరీష్ రావు పార్టీలో అంత కంఫర్టబుల్ గా లేరని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇటీవలి పరిణామాలు అందుకు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. కుమారుడి చదువు అనేది వ్యక్తిగత విషయమైనప్పటికీ, రాజకీయాల్లో టైమింగ్ ముఖ్యం కాబట్టి, ఆయన పర్యటన వెనుక రాజకీయ వ్యూహం కూడా ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన కొంత అసంతృప్తితో ఉన్నారని, అందుకే ఈ విదేశీ పర్యటనను ఒక సాకుగా తీసుకున్నారని ప్రత్యర్థి వర్గాలు ప్రచారం చేస్తున్నాయి.హరీష్ రావు లేని సమయంలో తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారేఅవకాశం ఉంది. ఇప్పటికీ పార్టీ గాడిన పడకపోవడం, పార్టీ పునర్నిర్మాణం వంటి సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్ నాయకత్వానికి, హరీష్ రావు గైర్హాజరీ ఒక లోటుగానే కనిపిస్తోంది. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత పార్టీలో తన పాత్రపై ఎలాంటి స్పష్టత ఇస్తారో వేచి చూడాలి. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటన మాత్రం బీఆర్ఎస్ లో ఏదో జరుగుతోందన్న గాసిప్స్ కు మరింత ఆజ్యం పోసింది



# హాట్ స్పాట్ గా కొంపల్లి



**హైదరాబాద్, మే 15:**హైదరాబాద్ ఉత్తర ప్రాంతంలో ఐటీ విస్తరణ కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా కండ్లకోయలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గేట్‌వే ఐటీ పార్క్ పనులు వేగవంతం కావడంతో, ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారుతోంది. ఐటీ కంపెనీల రాకతో వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటం వల్ల ఐటీ నిపుణుల దృష్టి ఇప్పుడు మేడ్చల్, కొంపల్లి వైపు మళ్లింది.పశ్చిమ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో స్థిరాస్తి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో, మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు కొంపల్లి, దాని చుట్టుపక్కల ప్రాంతాలపై మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ ఇప్పటికీ బడ్జెట్ ధరలో నాణ్యమైన విల్లాలు, అపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. కండ్లకోయ ఐటీ పార్క్ పూర్తయితే ఈ ప్రాంతంలో నివాసాల డిమాండ్ మరిన్ని రెట్లు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు కనెక్టివిటీ ఈ ప్రాంతానికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్ , జాతీయ రహదారికి సమీపంలో ఉండటం వల్ల ప్రయాణం సులభతరంగా మారింది. దీనికి తోడు మెట్రో రైల్ రెండో దశ విస్తరణపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం కూడా రియల్ ఎస్టేట్ వృద్ధికి ఊతమిస్తోంది.కొంపల్లి, గుండ్లపోచంపల్లి, సుచిత్ర వంటి ప్రాంతాల్లో వెలుస్తున్న కొత్త ప్రాజెక్టులలో ఆధునిక వసతులు, విశాలమైన పార్కులు మరియు కమ్యూనిటీ హాల్స్ వంటి సదుపాయాలు ఉండటంతో ఐటీ ఉద్యోగులు ఇక్కడ స్థిరపడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ ధరలో లగ్జరీ జీవనశైలిని కోరుకునే వారికి నార్త్ హైదరాబాద్ ఇప్పుడు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోంది.

## ఘనంగా జాతీయ టెక్నాలజీ డే

**ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షో**

**హైదరాబాద్:**హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ) లో జాతీయ టెక్నాలజీ డే వేడుకలతో పాటు ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి హాజరై ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐ అభివృద్ధి చేసిన ఈ విద్యుత్ ఆధారిత ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ యంత్రాలు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. డీజిల్ ఆధారిత యంత్రాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఈ పరికరాలు తక్కువ నిర్వహణ ఖర్చు, సులభ వినియోగం, పర్యావరణ హిత పనితీరు వంటి ప్రత్యేకతలను కలిగి ఉన్నాయని వివరించారు. మహిళా రైతులు కూడా సులభంగా వినియోగించుకునేలా ప్రత్యేక డిజైన్తో రూపొందించినట్లు వెల్లడించారు. సుస్థిర వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ రోడ్షో ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఆసక్తి వ్యక్తం చేశారు. రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు సహా 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
శనివారం 16 మే 2026

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**నిరుద్యోగులు లక్ష్యాలకు అనుగుణంగా చదవాలి**

**జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కృషి**

**లైబ్రరీ డే లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, మే 15(స్కై న్యూస్):**గ్రంథాలయంలోని పత్రికలు, పుస్తకాలను పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు చదివి సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో శుక్రవారం లైబ్రరీ డే సందర్భంగా గద్వాలలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. లైబ్రరీలో వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమైన అప్డేట్ పుస్తకాలను తెప్పిస్తామన్నారు. విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి తమకు కావాల్సిన పుస్తకాల లిస్ట్ రాసి ఇవ్వాలన్నారు. గ్రూప్స్, బ్యాంకింగ్, టీచర్, తదితర ఉద్యోగాలకు సాధన చేస్తున్న నిరుద్యోగులు పక్కా ప్రణాళికతో లక్ష్యాలకు అనుగుణంగా చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారన్నారు. ఒకే నోటిఫికేషన్ కోసం కాకుండా నిరుద్యోగులు తాము చదివిన కోర్సులకు రిలేటెడ్ గా ఉండే ఇతర ఉద్యోగాల కోసం కూడా సాధన చేస్తే ప్రయోజనం ఉంటుందనీ సూచించారు. గ్రంథాలయ పక్కా భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సమీపంలో ఉన్న పాత కోర్టు భవనంలోకి మార్చడానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న నిధులేకాక ఎంపీ నిధులతో పాటు కలెక్టర్ నిధులను కూడా మంజూరు చేస్తామన్నారు. టాయిలెట్స్, ఫ్యాన్లు, లైట్లు, కంప్యూటర్స్ అప్డేట్, ఇంటర్నెట్, ఇన్వర్టర్, తదితర సమస్యలను పలువురు నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చినందున పరిష్కరిస్తామన్నారు. మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండడంతో అందుబాటులో ఉన్న నిధులతో త్వరలోనే నిర్మిస్తామన్నారు. గ్రంథాలయంకు వచ్చే పాఠకులు తప్పనిసరిగా రిజిస్టర్లో సంతకాలు పెట్టాలని, లైబ్రరీ మెంబర్షిప్ కార్డును తీసుకొని సద్వియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయంలోని వివిధ సమస్యలపై కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ గ్రంథాలయ పరిసరాలను పరిశీలించి మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్కావెంజర్ ను నియమిస్తామన్నారు. సమీపంలోని నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డీఈవో విజయలక్ష్మి, లైబ్రేరియన్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాచీన కళల్ని కాపాడుకుని, భవిష్యత్ తరాలకు అందిద్దాం

**గంగన్నగూడలో వైభవంగా భక్త ప్రహ్లాద వీధి నాటక ప్రదర్శన**

**నరసింహస్వామి రూపంలో ఆకట్టుకున్న చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి**

**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామంలో గత రెండు రోజులుగా భక్త ప్రహ్లాద వీధి నాటక ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగి ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది చివరి రోజు నరసింహస్వామి అవతారంలో ఆకట్టుకున్న బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ప్రేక్షకుల చేత శభాష్ అనిపించారు గత అనేక సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కష్టసుఖాలు మరిచిపోయేందుకు పురాణ, ఇతిహాసాలను నాటక రూపంలో ప్రదర్శించి ఆనందాన్ని పొందేవారు ప్రస్తుత ఎ ఐ కాలంలో సాంకేతిక టెక్నాలజీలో వచ్చిన విపరీత మార్పులు గ్రామీణ ప్రాంతాలలో ప్రాచీన కళల్ని హరిస్తున్నాయి ప్రస్తుతానికి అక్కడక్కడ కొన్ని గ్రామాలలో ఉన్న కళాకారులు ఇంకా వాటిని కొనసాగిస్తున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలు గ్రామాలలో ఇచ్చిన సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో వీధి నాటక ప్రదర్శనలో పాల్గొనడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పంతులు మల్లేష్, భీమయ్య, కృష్ణయ్య, రామచంద్రయ్య, వెంకటయ్య, బాలచారి, రమేష్, ప్రవీణ్ చారి, కృష్ణమాచారి, అంజయ్య, శానమని శ్రీను, పల్లె శ్రీనివాస్, యాదయ్య,



రాములు, మధు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాయిహర్షిత్ మృతి...



**కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి**

**చిన్న చింతకుంట మే 15 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలందమగ్నపూర్ గ్రామం రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో నాగరాజు కుమారుడు సాయి వర్షిత్ మరణించడం తో శుక్రవారం గ్రామంలో చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పద్మ ని పరమర్శించడం జరిగింది మాజీ ఎమ్మెల్యే అల వెంట మండల పరిధిలోని బి.ఆర్.ఎస్ మాజీ సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు



**న్యూ డిల్లి మే 15:** దేశవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగాయి.దేశంలోని వాహనదారులకు చమురు సంస్థలు గట్టి షాక్ ఇచ్చాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ శుక్రవారం (మే 15, 2026) నిర్ణయం తీసుకున్నాయి. లీటరు పెట్రోల్పై రూ. 3, డీజిల్పై రూ. 3 చొప్పున సగటున పెరిగాయి. ఈ పెరిగిన ధరలు ఈరోజు ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. తాజా పెంపుతో నాలుగు మెట్రో నగరాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంధన ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. తాజా పెంపుతో గుంటూరులో లీటర్ పెట్రోల్ రూ.112.64, డీజిల్ రూ. 100.34కు చేరింది. హైదరాబాద్లో పెట్రోల్ రూ.110.89కు, డీజిల్ రూ.98.96కు పెరిగింది.

## హజ్ యాత్రికులకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులకు సన్మానించిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల,మే15(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎర్ర మట్టి వీధి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సీనియర్ నాయకులు కోడిగుడ్ల సలాం దంపతులను గద్వాల నుండి హజ్ యాత్ర కు వెళుతున్న యాత్రికులకు సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి గృహానికి వెళ్లి ఆయన కు పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే హజ్ యాత్ర కు కోడిగుడ్ల సలాం దంపతులను శాలువా కప్పి పూల దండలు వేసి ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళుతున్న యాత్రికులు నలభై ఒక్క రోజుల పాటు అల్లా ప్రార్ధన మందిరంలో మీరు చేసే ప్రార్థనలు దేశం, తెలంగాణ రాష్ట్రం గద్వాల నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ప్రార్థించి రైతులకు సకాలంలో వర్షాలు పడి రైతుల గురించి వివిధ వ్యాపార సంస్థల అభివృద్ధి చెందాలి ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆ అల్లాను వేడుకుంటూ దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ క్షేమంగా వెళ్లి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ దేవుడి ఆశీస్సులతో హజ్ యాత్రను పూర్తిచేసుకుని రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్, మాజీ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు మజీద్, నాయకులు సురేందర్ రెడ్డి, సీసాల పాషా, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వి కె ఎఫ్ ఎస్ టి వృద్ధాశ్రమానికి విశ్వహిత ఫౌండేషన్ వారి భారీ విరాళం



**హైద్రాబాద్ మే 15 :** విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ రంగారెడ్డి జిల్లాలోని జిల్లేడు చౌదరిగుడ మండలం రావిర్యాల గ్రామంలో ఎన్ఆర్ఐ వరప్రసాద్ గురజాపు విరాళంగా ఇచ్చిన 2000 గజాల భూమిలో వికె ప్రకృతి వనం పేరిట వృద్ధాశ్రమ నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం మే నెల 3 తారీఖున జరిగినట్లు ట్రస్ట్ అధ్యక్షులు తుంపాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ భారీ నిర్మాణానికి నిధి సేకరణ కూడా చేపట్టామని, తమ విజ్ఞప్తి కి స్పందించిన విశ్వహిత ఫౌండేషన్ వారు వారి హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో 'లక్ష రూపాయల' విరాళం విశ్వహిత ఫౌండేషన్ స్థాపకులు నిరంజన్ రెడ్డి అందజేసినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమానికి విశ్వహిత ఫౌండేషన్ స్థాపకులు వినోద్ పెంజెర్ల, వెంకట్ రమణ లతో పాటు, సురేష్ పెంజర్ల, రామశర్మ లు హాజరయ్యారు. కార్యక్రమానికి అతిథులుగా వెస్సో ట్రస్ట్ నుండి బంగారు తాతారావు, విశ్వంలో విలీనం సేవ ట్రస్ట్ నుండి పెంట శ్రీనివాస ఆచార్య మరియు చైతన్య స్రవంతి ట్రస్ట్ నుండి కడారు వీరబ్రహ్మం హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఐ క్లౌడ్ లాజిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చే ప్రమోట్ చేయబడి, ఆగస్టు 2023 లో ప్రారంభింపబడి, అనాధ బాలికల సంరక్షణ మరియు భవిష్యత్తు, సేవా సంస్థలకు ఐటీ సేవల మద్దతు, సెంటర్ ఫర్ పీపుల్ ఫారెస్ట్రీ వారి భాగస్వామ్యంతో అడవి బిడ్డల జీవనోపాధి కార్యక్రమాలు, వెస్సో ట్రస్ట్, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్, మరియు విశ్వంలో విలీనం సేవ ట్రస్ట్ వంటి సేవా సంస్థలకు ఆర్థిక మద్దతు ఇస్తూ, ఉభయ తెలుగు రాష్ట్రాల సామాజిక సేవలలో ఇతోధికంగా పాల్గొంటున్నట్లు తెలియజేశారు.

## వీబిజి రామ్ జి చట్టం రద్దు అయ్యేంతవరకు పోరాటం చేస్తాం

**: ఎస్ అజయ్, జి సత్యం, కె శంకర్ పోరాటం చేస్తాం**




**దేవరకద్ర, ఆత్మకూర్ మే 15 (స్కై న్యూస్);** వీబిజి రామ్ జి చట్టం రద్దు అయ్యేంత వరకు పోరాటం చేస్తాం. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్.జిల్లా నాయకులు జి. సత్యం. కె శంకర్. లు ఆత్మకూరు మండలం లోని పిన్నంచర్ల. గుంటి పల్లి గ్రామాలల్లో శుక్రవారం నాడు జరిగిన దేశ వ్యాప్త ఉపాధి కూలీల సమ్మె లో భాగంగా పిన్నం చర్ల లొ గ్రామపంచాయతీ కార్యలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఆత్మకూరు ఈ జి యస్. ఏపీవో అరుణ కు గుంటిపల్లి లొ పంచాయతీ కార్యదర్శి నరేష్ లకు మెమోరాండం ఇచ్చి అనంతరంవారు మాట్లాడుతూ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజగార్ అజివిక (మిషన్ వీబిజి రామ్ జి ).కొత్త చట్టం రద్దు చెసి ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ ను కొనసాగాలని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిరోజు ఉపాధి పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ తీసే విధానంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడవులలో పనులు జరగడం వల్ల నెట్వర్క్ రాకపోవడంతో కూలీలు ఎంతో దూరం నుంచి వచ్చిన ఫోటోకాప్చర్ రాకపోవడంతో వెనుతిరిగి ఆరోజుపూర్తిగా పని కోల్పోవాల్సిన దుస్థితిఏర్పడింది అన్నారు.పని ప్రదేశంలో మంచినీటి వసతి ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ తట్ట బుట్ట ఫస్ట్ ఎయిడ్ బాక్స్, పారలు,టెంట్లు సరపరచేయాలనీ కోరారు. కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి600 ఇవ్వాలని ఏడాదికి 200 ఉపాధి పని దినాలను కల్పించాలని మహాత్మా గాంధీ జాతీయ పథకం స్థానంలో కొత్తగా తెచ్చిన నరేగా స్కీంను రద్దుచేసి పాత పద్ధతిలోనే కేంద్రం 90 శాతం రాష్ట్రం 10% నిధులను భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి సిబ్బంది 4నెలల వేతనబకాయిలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లకు 26000కనీసవేతనం అమలు చేయాలనీ డీమాండ్ చెశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమి లేని పేదలకు ఏడాదికి యిచ్చే 12000.కు నిధులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలనీ కోరారు. కార్యక్రమంలో.సత్యన్న. స్వప్న ఆశన్న. చంద్రయుడు. పోలన్న నిర్మల నారాయణ రెడ్డి గోవిందమ్మా తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో నూతనంగా నిర్మించిన ఇంద్రమ్మ ఇండ్లను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో బురాన్ సుదర్శన్, సున్నపు లక్ష్మి, గుడేన్నోళ్ల శంకరమ్మ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను చేవెళ్ల నియోజకవర్గం శాసనసభ్యులు కాలె యాదయ్య ప్రారంభించారు ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు పేదలు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ. 5 లక్షలు అందిస్తుందని తెలిపారు నా పుట్టినరోజు వేడుకలకు వచ్చే నాయకులు శాలువలు, పూలే బొకేలు తీసుకురావొద్దని, బుక్స్, పెన్నులు తీసుకురావాలని సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆర్ల లింగంను పరామర్శించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన ఆర్ల లింగం ఇటీవల ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వారి స్వగృహానికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని వై. రవీందర్ యాదవ్ ఆకాంక్షించారు అదేవిధంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ఆయన భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవయ్య, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్ ఉన్నారు.

## పెట్రో ధరల పెంపుతో ప్రజలపై మోదీ ప్రభుత్వ మరో భారం

**టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



**హైద్రాబాద్ మే 15 :** పెట్రో రేట్ల పెంపుపై టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ పెట్రో ధరల పెంపు ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్న సమయంలో కూడా దేశంలో పెట్రో ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు.పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని, చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతాడన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రజల సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

వార్తాతరంగాలు

శనివారం 16 మే 2026

## చిన్నారుల మరణాలపై
# చిల్ట్ డెత్ రివ్యూ కార్యక్రమం



**కొత్తగూడెం మే 15 (స్కై న్యూస్ ):**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు, జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజేషన్ అధికారి డా ప్రతాప్ సమక్షంలో ఈ రోజు జిల్లా డి యం ఎచ్ ఓ కార్యాలయంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన చిన్నారుల మరణాలపై చిల్ట్ డెత్ రివ్యూ కార్యక్రమం నిర్వహించబడింది.సమావేశంలో చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, మరణాలకు దారితీసిన కారణాలపై విచారణ చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు అవసరమైన చర్యలపై వైద్య అధికారులకు సూచనలు అందజేయబడినవి.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ మాతృ శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అలాగే గర్భిణీలు బాలింతలకు ప్రసవం అనంతరం పిల్లలు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య విద్య, పోషకాహార సూచనలు వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సి హెచ్ ఓ నాగభూషణం ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## చలోఈనెల 17న హైదరాబాద్ లో జరుగు కుమ్మరుల సమావేశముకు కదిలి రండి

**మాజీ కుమ్మరుల ఎం, నగర్ అధ్యక్షులు బుగ్గన్న**





**దేవరకద్ర మే 15 (స్కై న్యూస్తె)** తెలంగాణ రాష్ట్ర కుమ్మరల సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తారీకు ఆదివారం రోజు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్ నందు 33 జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశంకు రాష్ట్రంలోని కుమ్మరులు అందరు కదిలి రావాలని మహబూబ్ నగర్ మాజీ జిల్లా అధ్యక్షులు బుగ్గన్న శుక్రవారంతెలిపారు.ఈ సమావేశానికి మన మహబూబ్నగర్ జిల్లా జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు సంఘం ముఖ్యులు నాయకులు పాల్గొని విజయవంతం చేద్దామన్నారు.ఈ సమావేశం కుమ్మరుల అభివృద్ధికై భవిష్యత్ కార్యచరణానికి నాందిగా నిలుద్దాం అన్నారు.గ్రామీణ ప్రాంతంలో ఉన్న కుమ్మర సమాజం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారిన మన కులానికి ఇప్పటివరకు ఒరిగింది ఏమీ లేదు అన్నారు. రాజకీయంగా కనీసం నామినేటెడ్ పదవులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు అన్నారు. మనందరం ఏకతాటిపై ఉండి మనకు రావాల్సిన ప్రతి ఒక్కటి పోరాటం చేసి సాధించుకోవాల్సిందే అందుకు మనందరం ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని కోరుకుంటూ ఆదివారం రోజు జరిగే సమావేశానికి మహబూబ్నగర్ జిల్లా కుమ్మర సంగం నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయడానికి మన బాధ్యతగా భావించి మన వంతు సహకారం అందిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత**




**నాగర్ కర్నూల్ మే 15( స్కైన్యూస్)** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 12వ వార్డులో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ బాలికపై హత్యాచారం చేసి తండ్రి అండదండలతో తప్పించుకునేందుకు బాలిక కుటుంబం పైనే ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేసేలా ప్రయత్నిస్తున్నారని వెంటనే ఆయనను అరెస్టు చేసి బాలికకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేసిన ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు చట్టం సామాన్యులకు ఒకలాగా ధనవంతులకు మరో మార్చడం దారుణమని విమర్శించారు. నిత్యం హిందూ ధర్మం గురించి చెప్పుకునే నేతలు ఈ సంఘటనపై ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారని అన్నారు అనేక మంది కేంద్ర మంత్రులతో పాటు బిజెపి నాయకులు మహిళలను వేధించడం సంఘటనలు ఉన్నాయని ఆరోపించారు మహాత్ముడు కలలుగన్న రాజ్యం తీసుకురావాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబానికి అండగా నిలిచి నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకురాలు జాంగిర్ భాను సులోచన రమాదేవి జ్యోతి అరుణ రాజేశ్వరి పుష్పలత తదితరులు పాల్గొన్నారు

## నేడు క్యాంపస్ ఇంటర్వ్యూ ప్రత్యేక నియామక డ్రైవ్

**నారాయణపేట,మే 15 : (స్కైన్యూస్)**నారాయణపేటలోని శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పుస్కల్ అగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఈ నెల 16అన ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో క్యాంపస్ ఇంటర్వ్యూ, ప్రత్యేక నియామక డ్రైవ్ నిర్వహించబడుతుందనీ ప్రిన్సిపాల్ డా.మెర్సీ వసంత తెలిపారు..ఈ నియామక కార్యక్రమం ద్వారా విద్యా ర్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ డం లక్ష్యంగా పెట్టుకున్నా రన్నారు. ఇందులో మొత్తం 60 ఉద్యోగ ఖాళీలు అందు బాటులో ఉన్నాయనీ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుజలు సేల్స్ , మార్కె టింగ్ విభాగంలో పని చేయా ల్సి ఉంటుందని తెలిపారు.ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన వారు లేదా మార్కెటింగ్ రంగంలో అనుభవం ఉన్న వారు ఇంటర్వ్యూకు హాజరు కావడానికి అర్హులనీ తెలిపారు. ఉద్యోగ ప్రాంతా లు మక్తల్, ఐజ , జహీరా బాద్ ,ప్రగ్నాపూర్ ప్రాంతాల్లో ఉంటాయనీ అన్నారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000వేతనంతో పాటు టి ఏ ,డి ఏ తో పాటు పనితీరు ఆధారిత ఆకర్ష ణీయమైన ఇన్సెంటివ్‌లు అందజేయబడతాయనీ వివరించారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ అప్‌డేటెడ్ రెజ్యూమ్‌తో నేరుగా కళాశా లకు వచ్చి ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్లేస్‌మెంట్ సెల్ కోరింది.విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. మెర్సీ వసంత కోరారు

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ
# సజావుగా నిర్వహించాలి...

**ప్యాడి క్లీనర్స్ వినియోగిస్తేనే నాణ్యమైన ధాన్యం**

**ఇతర రాష్ట్రాల ధాన్యం కేంద్రాలకు రాకుండా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట చర్యలు అవసరం.**

**యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలు.**



**జోగులాంబ గద్వాల, మే 14 (స్కై న్యూస్):**ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కేటీ దొడ్డి మండల కేంద్రంతోపాటు కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి ముందుగా తీసుకొచ్చిన రైతుల ధాన్యానికి నిబంధనల ప్రకారం తేమ వస్తే వెంటనే తూకం చేసి మిల్లులకు తరలించాలన్నారు. ముందు వచ్చిన రైతులకు కాకుండా వెనుక వచ్చిన వారి ధాన్యం కొనుగోలు చేయడం సరికాదన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తికాగానే ఓపిఎంఎస్ కాకుంటే రైతులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడతారన్నారు. కేంద్రం నిర్వహకులు, సంబంధిత అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాడి క్లీనర్స్ తో ధాన్యంను శుభ్రం చేయకుండా మిల్లులకు పంపిస్తే మిల్లర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తారన్నారు. దొడ్డు, సన్నరకం ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. లారీలు, హమాలీల సమస్య ఈ కేంద్రాల వద్ద లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ధాన్యం కుప్పలను పరిశీలించి నిర్దేశిత తేమ శాతం రాగానే తూకం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. లారీలలో సంబంధిత మిల్లులకు ధాన్యం పంపే క్రమంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. వివిధ రిజిస్టర్ లను పరిశీలించి, ట్రక్ షీట్ వివరాల్లో తప్పిదాలు ఉండడంతో సరిచేసి పంపాలని, నిబంధనలను అతిక్రమిస్తే షోకాజు నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం నందిన్నె అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద చేస్తున్న వాహనాల తనిఖీ విధానం, రిజిస్టర్ నిర్వహణ, ఆయా వాహనాల పత్రాల పరిశీలన తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల మొక్కజొన్న, వరి ధాన్యం రాకుండా చూడాలన్నారు. ప్రతి వాహనం యొక్క నంబర్, సరకు రవాణాకు సంబంధించిన బిల్లు నంబర్లు, సంబంధిత పత్రాల వివరాలను నిర్దేశిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కేవలం జిరాక్స్ ప్రతులు తీసుకోవడం సరిపోదని, సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అవసరమైతే వాహన పత్రాల ఫోటోలు కూడా భద్రపరచాలని సూచించారు. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకొని బాధ్యతాయుతంగా పని చేసి, ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్ట్ వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు కేటీ దొడ్డి మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవెల్ పూర్తయినందున మొదట అకాడమిక్ బ్లాక్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఒప్పందం ప్రకారం ఏడాదిన్నరలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని, అందుకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించారు. అన్ని జిల్లాల్లో పాఠశాల భవనం ప్లాన్ ఒకే విధంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో విద్యుత్ లైన్ మార్చాల్సి ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో పౌర సరఫరాల శాఖ మేనేజర్ విమల, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, కేటీ దొడ్డి తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారావు, విద్యాశాఖ ఇంజనీర్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలియం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు పలు వ్యూహాత్మక ఒప్పందాలు

**యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు**



**న్యూస్ డిల్లి మే 15 ;** ఐదు దేశాల పర్యటనలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరుకున్న ప్రధాని నరేంద్రమోదీ యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లటంతోపాటు పశ్చిమాసియా సంక్షోభంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎల్?పీజీ సరఫరా, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల రంగాల్లో సహకారంతోపాటు పలు ఒప్పందాలు చేసుకున్నారు. భారత్‌లో మౌలిక సదుపాయాల రంగంలో 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. అలాగే, వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటుపై యూఏఈతో ఎంవోయూతో ఒప్పందం చేసుకున్నారు. మరోవైపు, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ దాడిని మోదీ ఖండించారు."పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ప్రపంచం మొత్తంపై ఉంది. అయితే, భారత్ ఎప్పుడూ చర్చలు, సంప్రదింపులకే ప్రాధాన్యమిస్తుంది. చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్ జలసంధి ఎప్పుడూ తెరిచే ఉండాలి. అదేవిధంగా హర్మూజ్‌పై అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలి. అలాగే, ఇరాన్?, యూఏఈని లక్ష్యంగా చేసుకున్న తీరు ఆమోదయోగ్యం కాదు. కానీ, ప్రస్తుత పరిస్థితిని యూఏఈ సంయమనంతో ఎదుర్కోవడం ప్రశంసనీయం. భారత్ ఎప్పుడూ యూఏఈతో చేతిలో చేయి వేసే నడిచింది. యూఏఈతో భారత్ అనుబంధం ఇకముందూ కొనసాగుతుంది- నరేంద్ర మోదీ, భారత ప్రధాని

**ఇంధన భద్రతపైనే ఫోకస్?**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ ఐదు దేశాల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, యూఏఈ అధ్యక్షుడితో జరిగిన భేటీలో పశ్చిమాసియా యుద్ధంతో నెలకొన్న పరిస్థితులపై ఇరుదేశాధినేతలు చర్చించారు. అలాగే, యూఏఈలో నివసిస్తున్న 45లక్షల మంది భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వాడినార్‌లో భారీ నౌకా మరమ్మతుల క్లస్టర్‌ను ఏర్పాటు చేసే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత మౌలిక సదుపాయాల రంగంతోపాటు ఆర్బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో దాదాపు 40వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న తరుణంలో భారత్‌కు యూఏఈ అత్యంత విశ్వసనీయమైన ఇంధన భాగస్వామిగా నిలుస్తుందని ఈ ఒప్పందాలు స్పష్టం చేస్తున్నాయి.

# మే 26న కేరళలో ప్రవేశించ నున్న నైరుతి రుతుపవనాలు



**న్యూ డిల్లి మే 15 :**ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మే 24న ప్రవేశించినట్లు ఆ శాఖ వెల్లడించింది.

**తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం**

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది." అని ఐఎండీ పేర్కొంది.

**సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం**

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ×వీణ తెలిపింది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటమే దీనికి కారణం కావచ్చని ×వీణ అభిప్రాయపడింది. రుతుపవన కాలాల్లో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది.దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా నైరుతి రుతుపవనాలను పిలుస్తారు. నాలుగు నెలల పాటు సాగే ఈ రుతుపవన కాలం దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని అందిస్తుంది. వ్యవసాయానికి, పంటలకు, మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, అలాగే జలాశయాలు, భూగర్భ జలాలను తిరిగి నింపడానికి ఇది అత్యంత కీలకం. మన దేశంలో 50 శాతానికి పైగా నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

# సాంస్కృతిక కర్తవ్యాన్ని భావితరాలకు అందించాలి

**ఈనెల 16, 17న అలంపూర్ లో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశాలు**



సమాజ చైతన్యం కోసం సాంస్కృతిక కర్తవ్యాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆశన్న తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయం వద్ద గురువారం ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశాలు జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ పట్టణంలో ఈనెల 16 17న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన పాటలు నాటికలు వంటి కార్యక్రమాలను రూపొందించుకునేందుకు భవిష్యత్తు కర్తవ్యాలను ఈ సమావేశాల్లో చర్చించడం జరుగుతుందన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు ప్రజానాట్యమండలి కార్యక్రమాలను కొత్త ఆట, పాటలు రూపొందించుకుంటుందన్నారు. ఈ సందర్భంగా అలంపూర్ మండలం లింగనవాయి గ్రామంలో 16వ తేదీ సాయంత్రం ప్రజా నాట్యమండలి పాట, ఆలాపన కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతం చేసేందుకు సహాయ సహకారాలు అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలీ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యక్షులు రమేష్, ఏలియా పాల్గొన్నారు.

# భారత్ ఈ రెండు దేశాల మధ్య సమర్థవంతమైన మధ్యవర్తిగా సేవలు అందించగలదు

## రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు

**న్యూ ఢిల్లీ 15**: పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఈ రెండు దేశాల మధ్య సమర్థవంతమైన మధ్యవర్తిగా సేవలు అందించగలదని పేర్కొన్నారు. ఢిల్లీకి ఈ విషయంలో అపారమైన దౌత్య అనుభవం, అంతర్జాతీయ ప్రతిష్ఠ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం అనంతరం లావ్రోవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఇరాన్?, అమెరికా మధ్య శాంతి చర్చల కోసం పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని అన్నారు. అయితే పశ్చిమాసియాలో దీర్ఘకాలిక ఉద్రిక్తతలు, అస్థిరతను నివారించడంలో భారత్? కీలక పాత్ర పోషించగలదని లావ్రోవ్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ యూఏఈ పర్యటనలో ఉన్న సమయంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం "అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరిపించడానికి పాకిస్థాన్ కృషి చేస్తోంది. ఒకవేళ వారు ఇరాన్, దాని అరబ్



మిత్రదేశాల మధ్య దీర్ఘకాలిక మధ్యవర్తిని కోరుకుంటే, భారత్? తన అపారమైన దౌత్య అనుభవంతో సమర్థవంతమైన మధ్యవర్తి పాత్రను పోషించగలదు- సెర్గీ లావ్రోవ్?, రష్యా విదేశాంగ మంత్రి ఓ వైపు, ఇరాన్ ఘర్షణపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. మరోవైపు రష్యా, ఇరాన్? చమురుపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో రష్యా విదేశాంగ మంత్రి భారత్ పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఇరాన్ పై అమెరికా చేసింది దురాక్రమణే!**

పశ్చిమాసియా సంక్షోభం, హర్మూజ్? జలసంధి దిగ్బంధంపై లావ్రోవ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఏ విధంగానూ? రెచ్చగొట్టకపోయినా, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్?లు దాడులు చేయాలని, ఇది దురాక్రమణేనని ఆయన పేర్కొన్నారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుత అస్థిర వాతావరణానికి ఇరాన్? ఎంతమాత్రం బాధ్యురాలు కాదని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సు తర్వాత ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఇరాన్?పై దాడి చేయకముందు, హర్మూజ్? జలసంధిలో సురక్షితమైన నౌకాయానం ఉండేదని గుర్తు చేశారు.

# రక్తదానాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి....



**నాగర్ కర్నూల్ మే 15 (స్కై న్యూస్)** రక్తదానం చేయడం యువత ఆదర్శంగా తీసుకొని అత్యవసర సమయాలలో రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టి ఉషారాణి కోరారు శుక్రవారం నర్సింగ్ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం ఉండటం వల్ల రోగుల ప్రాణాలు కాపాడేందుకు అధికంగా రక్తం అవసరం ఏర్పడిందని దానిని అధిగమించేందుకు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో యువత 15 యూనిట్ల రక్తాన్ని అందించడం హర్షనీయమన్నారు. ఆసుపత్రిలో నిత్యం జరిగే వైద్య సేవలను రక్తహీనత గల రోగులకు మరియు గర్భవతులకు ప్రసవ సమయంలో సాధారణ ఆపరేషన్ అవసర సమయంలో మరియు ఆర్థోపెడిక్ ఆపరేషన్ సమయంలో రక్తదానం చేసిన వారి రక్తాన్ని రోగులకు అందించడం జరుగుతుందని ఆమె వివరించారు. రక్తదానం చేసిన వారికి 90 రోజులలో యధావిధిగా రక్తం పునరుత్పత్తి జరుగుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి ఆర్ఎంవో డాక్టర్ ఏ రోహిత్ కుమార్ నర్సింగ్ అధికారులు కిరణ్ రామాంజనేయులు సాయినాథ్ హెడ్ నర్స్ రాధా ల్యాబ్ టెక్నీషియన్లు రాజు వెంకట్ దత్తాత్రేయులు హెల్ప్ డెస్క్ ఇంచార్జి యాదగిరి తో పలువురు సిబ్బంది పాల్గొన్నారు

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన లక్ష్యం

## ఆర్థిక భద్రతకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి







**నాగర్ కర్నూలు మే 15 (స్కై న్యూస్)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల జీవితాలలో వెలుగులు నింపేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తూ ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి వివరించారు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని తాడూర్ తెలకపల్లి మండలాలకు చెందిన షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంట్లో వివాహాలు భారం కాకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు కార్యకర్తలు చైతన్యం చేయాలని కోరారు. సమాజంలోని ప్రతి వర్గానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కాంగ్రెస్ పార్టీ తాడూరు మండల అధ్యక్షుడు యారా రమేష్ తెలకపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బండా పర్వతాలు తో పాటు అధికారులు ముఖ్య నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు

# హజ్ యాత్రకు వెళ్తున్న వార్డు మెంబర్ ఎండీ సుల్తాన్‌కు ఘన వీడ్కోలు

## శుభాకాంక్షలు తెలిపిన మాజీ జడ్పిటిసి నర్సింగ్ రావు, యువనాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్





**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్)** కేశంపేట్ మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ ఎండీ సుల్తాన్ హజ్ యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా గ్రామంలో ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి నర్సింగ్ రావు, యువనాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ సుల్తాన్ కు పుష్పగుచ్ఛం అందజేసి విజయవంతమైన హజ్ యాత్ర జరగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ నరేష్, వార్డ్ మెంబర్ వెంకట్ రామ్ రెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, సుదర్శన్, కుమ్మరి యాదయ్య, దశరత్, మహ్మద్, సుభహన్, యాదగిరి, మధు యాదవ్, బాబా, గోపాల్ నాయక్, రోశయ్య, రవి నాయక్ తదితరులు పాల్గొని తమ శుభాకాంక్షలు తెలిపారు.

# సమ్మర్ క్రికెట్ క్యాంపును ప్రారంభించిన అదనపు ఎస్పీ




**నారాయణపేట మే 15: (స్కైన్యూస్)** నారాయణపేట మినీ స్టేడియంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్ ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ , ఉపాధ్యక్షుడు సురేష్,జి.ఆర్.రెడ్డితో కలిసి ప్రారంబించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ శిక్షణతో రాటుదేలి జిల్లా రాష్ట్ర,జాతీయ స్థాయిలో రాణించవచ్చునని అన్నారు.బాగా శిక్షణ పొంది రాణించాలని ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంఛార్జి రమణ,కోచ్ లు అజయ్,కృష్ణ,అమరేశ్,చిన్నారెడ్డి,ప్రవీణ్,రవికుమార్,శ్రీనివాసులు ,క్రీడాకారులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలతో మోసాలకు గురి కావొద్దు..

## సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి

## సీఐ అశోక్ రెడ్డి




**నాగర్ కర్నూల్ మే 15 (స్కైన్యూస్)** సైబర్ మోసాలకు మరియు ఫేస్బుక్ పరిచయాలతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ అశోక్ రెడ్డి కోరారు క్లాస్ మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినిత్యం సేవా కార్యక్రమాలలో భాగంగా 134వ రోజు శుక్రవారం ఫేస్బుక్ ఫౌండర్ మార్క్ జూకర్ బర్గ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా అనంతరం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఫేస్బుక్ ద్వారా పరిచయాలు ఏర్పాటు చేసుకుని అనేక మార్గాలలో అక్రమాలకు పాల్పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఫేస్బుక్ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ నిజా నిజాలను నిర్ధారించుకోవాలని కోరారు తప్పుడు వార్తలు అసత్య ప్రచారాలు రెచ్చగొట్టే పోస్టులు షేర్ చేయడం వల్ల చట్టపరమైన సమస్యలు కూడా ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు బ్యాంకు సమాచారం బోటిపులు వంటి గోప్యమైన సమాచారాన్ని సోషల్ మీడియాలో లేదా అనుమానాస్పద లింకుల ద్వారా ఎవరికి తెలియజేయవద్దని సూచించారు ఫేస్బుక్లో నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగానికి పరిమితులు పెట్టుకోవాలని చదువు వ్యక్తిగత జీవితంపై వీటి ప్రభావం లేకుండా చూసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్ క్లాస్ మెంట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ క్లబ్ ప్రతినిధులు పోలా శ్రీనివాసులు చిగుళ్లపల్లి రమణ పాండు ఏ ఎస్ ఐ లు రామకృష్ణ నిరంజన్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ అంజన్న తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# వనమా రాఘవేందర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన.వనమా రాఘవేందర్

## అధికారులతో రైస్ మిల్లర్లు దళారులు కుమ్మక్కు. వనమా రాఘవేందర్






**చుంచుపల్లి మే 15 (స్కై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం పెనుగడప వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన దీ=ూ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ కొత్తగూడెం నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు.పెనుగడప వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అనంతరం రైతులతో మాట్లాడిన వనమా రాఘవేందర్ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం వరి ధాన్యాన్ని పరిశీలించారు.అనంతరం అక్కడున్నటువంటి ప్రభుత్వ అధికారినితో మాట్లాడగా మాపై అధికారులతో మాట్లాడవలసిందిగా అధికారిని, కోరగా అందుబాటులో అధికారులు లేని పక్షంలో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సరిత గతిన చేయాలని కోరారు, అనంతరం కార్యక్రమాన్ని, ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను చిన్న చూపు చూస్తుందని రైతుల పట్ల నిర్లక్ష్యం వాయిస్తుందని అదేవిధంగా రైతులకు యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వం ఫెయిల్ అయిపోయిందని కరెంటు 24 గంటలు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతూ ఇవ్వాలా వరి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా అదే విధంగా ప్రవర్తిస్తూ కోతలు పెట్టి అప్పటికి ధాన్యం కొనుగోలు చేస్తామని నెల రోజులుగా చెబుతూ ఇప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అకాల వర్షం పడితే రైతుల దుస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు కరెంటు ఇచ్చి టైం కు యూరియా అందించి కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటుచేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత కెసిఆర్ కెసిఆర్ ది అని గుర్తు చేశారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు,లేనియెడల రైతుల పక్షాన మా బి ఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతామాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బి ఆర్ ఎస్ (38) వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్, హమీద్, నరేందర్, చింతలపూడి జగన్, పెద్దమల్ల నరేందర్, ఉర్దూగా మాజీ చైర్మన్ అన్వర్ పాషా, రుక్మందర్ బండారి, వేముల ప్రసాద్, అమ్ముల వేణు, మాజీ సర్పంచ్ మోతి, శివ, శ్రీకాంత్, బత్తుల శీను, కన్ని, హైమద్, బొందుగుల శ్రీధర్, సురేందర్, పావులూరు చంద్రయ్య, ముత్యాల ప్రవీణ్, పిల్లి కుమార్, బట్టు మంజుల, పాషా, కాజా, లచ్చిరాం, మనోజ్, వినోద్,భూపతి శ్రీను, సయ్యద్ జానీ, కాళీ, కాపు శ్రీకాంత్, ఇర్ఫాన్, యూనిరి రాజేష్,ముదిగుల శివ, నూతన్, జగడం కిరణ్, జూపెల్లి దుర్గాప్రసాద్, వాసు మల్ల గౌతం, ఎస్ కే అహ్మద్ ఎస్కే అహ్మద్, అప్సర్ జహ 1వ వార్డు మెంబర్, తగరం శీను, విడగొట్టి మహేష్, వినగంటి శ్రీను, బషీర్ భాష, యాకూబ్ గోరి, పావురాల పుల్లయ్య, కట్టా వెంకన్న, పోతురాజు సతీష్, కట్టా మహేష్, పోతురాజు శీను, కట్ట నాగమణి, పి రమణ, కట్టా ప్రవీణ్, కట్ట భార్గవ్, వడ్డే మనోజ్, యూసఫ్ ఖాన్, ఈ రాంబాబు, తగరం రాంబాబు, ఉరుపెట్టి పుల్లయ్య, మంగళగిరి రామకృష్ణ, పింగళి శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# పుస్తక పఠనం తో మేధస్సు పెంపు

## జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్







**నాగర్ కర్నూల్ మే 15( స్కై న్యూస్)** విద్యార్థులలో పాఠనా ఆసక్తి పెంపొందించడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యావ్యవస్థలో విజ్ఞాన బండాగారాలుగా మారుతున్నాయని తెలిపారు. పుస్తకాలను అధ్యాయనం చేయడం ద్వారా సృజనాత్మకతతో పాటు విశ్లేషణ సామర్థ్యం ఆలోచన శక్తి అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని మరింత విస్తరించాలంటే పుస్తకాలను అధ్యయనం చేయడం అత్యంత అవసరమని అన్నారు. సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ జీవితంలో ప్రతి నిత్యం కొంత సమయాన్ని పుస్తకాలను అధ్యయనం చేయడానికి కేటాయించాలని ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు ప్రతి విద్యార్థికి సులభంగా జ్ఞానం అందించాలని లక్ష్యంతో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్ తో పాటు గ్రంథాలయ సిబ్బంది వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు
శనివారం 16 మే 2026

# విద్యానగర్ లో అగని బహూలా అంతస్తుల అక్రమ నిర్మాణాలు

**నోటీసులు అందుకున్న ఆగని అక్రమ నిర్మాణాలు**

**2018 పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకునేది ఎవరు ?**

**గిరిజన చట్టాలను లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు**

**ఆక్రమ నిర్మాణాలకు పార్కింగ్ ప్లేసులు వుండవు రోడ్లమీదనే వాహనాలు**



**చుంచుపల్లి మే 15 (స్కై న్యూస్):** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచయతీ పరిధిలో అనేక బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. గతంలో అనేక అక్రమ నిర్మాణాలపై వార్త తరంగాలు దినపత్రిక లో ఎన్నో కథనాలు ప్రచురించాయి . అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలంటూ పలుమార్లు విద్యానగర్ సెక్రటరీ నుండి నోటీసులు అందుకున్న అక్రమ నిర్మాణదారులు. నోటీసులు అందుకుంటాం కానీ అక్రమ నిర్మాణాలు ఆపమన్నట్టుగా నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి..అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికి 2018 పంచాయతీరాజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే బాగుంటుంది. నోటీసులు జారీ చేసే క్రమంలో 2018 పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం నిర్మాణాలు నిలుపుదల చేయకపోతే కఠిన చర్యలు అంటున్నారు తప్ప తీసుకోవడం లేదు. వారు ఎలాగూ చర్యలు తీసుకోలేరు మా పని మేము చేసుకుంటామంటూ అక్రమ నిర్మాణదారులు బరితెగించి నిర్మాణాలు చేస్తున్నారు 1/70 యాక్టులో నిర్మాణాలు చేపట్టవచ్చా చేపడితే గిరిజన చట్టాలు వారికి వర్తిస్తాయా లేక పంచాయతీ అధికారులు సిబ్బంది గిరిజన చట్టాలను తుంగలో తొక్కుత్నరీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారా? ఇవన్నీ తెలిసిన అధికారులు మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటా అని బహువటంగానే చర్చించుకుంటున్న ప్రజలు . ప్రజాప్రతినిధులు ఉన్నా లేనట్టుగానే ఉన్నది. మరి వారైనా ఇటువంటి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సిందే ఏది ఏమైనా విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు సైతం నిర్మిస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహమే లేదు.. ఇలా అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా నిర్మాణాలు చేస్తుండడం నిర్మాణాలు పూర్తయిన తర్వాత పార్కింగ్ ప్లేస్ ఉండక రోడ్లు మీదనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది దీనితో అనేక ఆక్సిడెంట్లు జరుగుతున్నాయి ఎన్ని రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు చేసినప్పటికీ అనుమతులు లేని వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ ప్లేస్ లేక రోడ్లమీదనే వాహనాలు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అనార్థాలు జరగకుండా ఉండాలంటే ముందుగానే ఇటువంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఆకులు కాలాక చేతులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టుగా పార్కింగ్ స్థలాలు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు నిర్మించకుండా ముందస్తుగానే కఠిన చర్యలు అధికారులు తీసుకుంటే ఈటువంటి ప్రమాదాలను నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కావున అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను జి ప్లస్ త్రీ నిర్మాణాలను సైతం నిలుపుదల చేసి వారికి అండగా నిలిచే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**అక్రమ గోవుల రవాణాపై కఠిన చర్యలు**

**బార్డర్ చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా**

**పోలీసు, రెవెన్యూ, వెటర్నరీ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు**




**నారాయణపేట మే 15: (స్కైన్యూస్)**నారాయణపేట: రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు అక్రమ గోవుల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు, వెటర్నరీ డాక్టర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అమలు చేయాల్సిన భద్రతా చర్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, పశువుల రవాణాపై నిఘా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... బక్రీద్ పండుగను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గోవులను తరలించినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలలో రవాణా చేసినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని బోర్డర్ చెక్‌పోస్టుల్లో 24ఐ7 పోలీసు సిబ్బందితో పాటు వెటర్నరీ డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా మక్తల్, మద్దూర్, కోస్గి సంతలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పశువుల రవాణా సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సరైన అనుమతి పత్రాలు మరియు "ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్" సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాలో పట్టుబడిన ఆవులు, లేగ దూడలను తాత్కాలిక గోశాలల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో అనుమతి పొందిన వధశాలల్లో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని, వధ అనంతరం మిగిలే వ్యర్థాలను అదే రోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను ఎక్కడ వేయాలో ముందుగానే మున్సిపల్ అధికారులు గుర్తించి అక్కడే గోతి తీసి పూర్చి వేయాలని ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ అధికారులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్ ఆర్డీఓ రమేష్, సిఐ లు శివ శంకర్, సైదులు, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, ఎస్ఐ లు రెవెన్యూ శాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలు భాగంగా గ్రంథాలయ శాఖ వారి ఆధ్వర్యంలో రచయితలకు సన్మానం



**హాలియా** :ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ యు కాంతయ్య .గ్రంథాలయ శాఖ ఇంచార్జ్ డాక్టర్ జి యాదగిరి ఆధ్వర్యంలో గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కళాశాలకు సంబంధించిన కవులు రచయితలు సన్మానించుకోవడం జరిగింది .గ్రంథాలయాలనేవి విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయని అందులో భాగంగానే ప్రజా పాలనలో గ్రంథాలయం యొక్క విశిష్టతను తెలియ చెప్పడం కోసమే గ్రంథపాటకుల కవులు కళాకారులను సన్మానించడం అభినందనీయం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సిహెచ్ రాజు కళాశాల అధ్యాపకులు .జి కవిత .డాక్టర్ వి మాధవి. కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు కృష్ణ శతకం పుస్తకం ఆవిష్కరించారు. ఆయనను సన్మానించినారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విజయవంతం చేసినారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ 15వార్డులో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగునూరు బసవేశ్వర్ అధికారులతో కలిసి పరిశీలించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సాదిక్, శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపీపీ ఇద్రిస్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వ కంగా కలిసిన నూతన ఆర్డీవో



**నారాయణపేట మే 15: (స్కైన్యూస్):**నారాయణపేట ఆర్డీఓ గా నూతనంగా నియమితులైన ఆర్డీవో ఎల్. రమేష్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ను శుక్రవారం ఎస్పీ కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీ కి పూల మొక్కను అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి , ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# పంట మార్పిడితోనే అధిక నికరాదాయం

**వెలిజెర్ల లో రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం**





**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని వెనిజర్ల గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్ రాజు, డాక్టర్ భారతి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల మార్పిడి ద్వారానే రైతులకు అధిక నికరాదాయం పొందగలరని తద్వారా భూసార పరిరక్షణ వాతావరణ కాలుష్యం నివారణ సాధ్యమవుతుందని వివరించారు రైతులు తప్పకుండా మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆ మట్టి పరీక్షల ఫలితాలు ఆధారంగా భూమిలో ఉన్న పోషక లభ్యత తెలుసుకొని సేంద్రీయ ఎరువులతో పాటు సిఫారసు చేసిన రసాయనిక ఎరువులనే వాడాలని తద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవాలని వివరించారు పచ్చి రొట్టె పైర్లు జీవన ఎరువుల వినియోగం పెంచుకొని యూరియా వాడకాన్ని తగ్గించాలని తద్వారా చీడపీడల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు భూసార పరిరక్షణ, వాతావరణ కాలుష్యనివారణ సాధ్యమవుతుందని వివరించారు వ్యవసాయంలో రసాయనిక పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతిలో సాగు చేయాలని తద్వారా నాణ్యమైన పంట దిగుబడులను అధిక మార్కెట్ ధరలు పొందాలని సూచించారు భావితరాలకు నీటి కొరత లేకుండా ఇంకుడు గుంతలు ఫాం పాండ్లను నిర్మించుకోవాలని, సాగు నీటిని దుర్వినియోగం చేయకుండా నీటి ఉత్పాదకతను పెంచాలన్నారు ఆరుతడి పద్ధతిలో వరిసాగు చేసి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని సూచించారు అదేవిధంగా వరి పంటలో సిఫారసు చేసిన సన్నగింజ రకాలు తెలంగాణ సోనా కెఎన్ఎమ్ 1638, డబ్ల్యూ జి ఎల్ 962 వంటి అధిక దిగుబడినట్లు చీడపీడలు తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలని నేరుగా వెదజల్లే విధానం ఆరుతడి పద్ధతిలో సాగు వంటి మేలైన యాజమాన్య విధానాలు పాటించాలని తెలిపారు అంతేకాకుండా సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని భావితరాలకు నీటి కొరత లేకుండా ఇంకుడు గుంతలు ఫాం పాండ్లను నిర్మించుకోవాలని రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబు నాయక్, ఉప సర్పంచ్ వెంకటేష్ యాదవ్, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఏఈఓలు గోవర్ధన్, తేజ్ కుమార్, కార్యదర్శి యాదయ్య, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ వివిద విభగాల అదిపతులతో సమీక్ష...





**సింగరేణి మే 15 (స్కై న్యూస్ ):**కొత్తగూడెం ఏరియా జిఎం కార్యలయం నందు మల్టి డిపార్ట్మెంటల్ టిమ్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగుల బధ్రతా ప్రమాణాలు, మరియు కంపెనీ ముందున్న సవాళ్ళు , నాణ్యతతో కూడిన బొగ్గును సరఫరా చేయడం వంటి విషయాలు చర్చించడం జరిగింది అలాగే 2026 --27 సంవత్సరానికి గాను సింగరేణి సంస్థ వ్యాప్తంగా 680 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని నిర్దేశిచడం జరిగిందని, అందులో భాగంగా కొత్తగూడెం ఏరియాకు గాను 22.50,(పి వి కె కి 2.50 వి కె సి ఎం కి 20.00) లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారని తెలియజేశారు. సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఏరియాలలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధన గురించి ,ఈ నెల 18వ తేది నుండి అన్ని గనులు విబాగాలలో, మల్టి డిపార్ట్మెంటల్ టీమ్ లు సమావేశాలను నిర్వహించి తద్వారా అధికారులు ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని వాటి ద్వారా భద్రత తో కూడిన వార్షిక లక్ష్యాలను చేదించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందని ఏరియా జిఎం ఎం.షాలెమ్ రాజు తెలిపారు. గనులు విభాగాల ఎండీటీ మీటింగ్ ప్రణాళిక ఈ విదంగా ఉన్నాయి.18 మేఉదయం గంటలకు పివికే 5 ఇంక్లైన్ గని యందు మొదటి షిఫ్ట్ మధ్యహ్నం 3 గంటలకు( రెండవ షిప్టు).21 మే : మద్యాహ్నం 3.00 గంటలకు జిఎం కార్యలయం నందు 22 మే : ఉదయం 7గంటలకు వి కె సి ఎం ఏరియా స్టోర్ , మద్యాహ్నం 3.00 గంటలకు సివిల్ ఉ ఎస్ఉ పీసీ , ఎంసీటీసీ ఆర్ డీ పీ డిస్పెన్సరీ నందు.23 మే : ఉదయం 7 గంటలకు ఆర్ సీ హెచ్ పీ , 11గంటలకు ఏరియా వర్క్ షాప్ నందు సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు .ఈ సమావేశంలో జిఎం తో పాటు , (ఎస్.ఓ.టు జిఎం) కోటిరెడ్డి , ఏజీఎం (సివిల్) రామకృష్ణ , డిజిఎం (ఐఈడి) యోహాన్ , ఏజిఎం ( ఫైనాన్స్ ) బీబత్స , పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో ,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు , డిజిఎం (ఈఉఏం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్ , పర్సనల్ మేనేజర్ తిరుపతి , (ఆర్.సి.హె.చ్.పి) ఇంచార్జ్ ఆజ్మీరా శ్రీనివాస్ , (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున రావు ఏఐటీయూసీ) అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య , (ఐఎన్‌టీయూసీ) వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ , ఇతర విభాగాల అదికారులు పత్రికా మిత్రులు పాల్గొన్నారు.

# గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయం-షాద్ నగర్ ఆధ్వర్యంలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**ముఖ్యఅతిథిగా హాజరైన ఫరూక్ నగర్ మండలం ఎంఈఓ మనోహర్**



**రంగారెడ్డి జిల్లా మే 15: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రేడ్-వన్ శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ షాద్ నగర్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫరూక్ నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ హాజరయ్యారు ఇందులో భాగంగా ఆయన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఫరూఖ్ నగర్ మండల విద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ నేటి సమాజానికి గ్రంథాలయాలు జీవన సోపానానికి ఎంతో దోహదపడతాయన్నారు పుస్తకాలు చదవడం వలన జ్ఞానంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చు అని అన్నారు ఈ గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులకు, పెద్దలకు, మహిళలకు, దేశ సాంప్రదాయానికి సంబంధించిన పౌరాణిక పుస్తకాలు సైతం ఇక్కడ ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు షాద్ నగర్ నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరు ఈ గ్రంథాలయాన్ని సందర్శించాలని, వారికి అవసరమైన పుస్తకాలను ఎంచుకొని చదువుకోవడానికి ఎంతో వీలుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ లు నక్క బాల్ రాజ్ యాదవ్, సి.వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యాసెట్ శ్రీనివాస్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, జాయింట్ ట్రెజరర్ కత్తి చంద్రశేఖర్ అప్ప,డైరెక్టర్లు, ర్యాకల శ్రీకాంత్ ముదిరాజ్, కాట్నా రాజేష్ లడ్డు, చీపిరి శివరాములు యాదవ్, కే.రవి నాయక్ ఎంబడి అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## షుగర్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేసే

# ఇసబ్‌గోల్






మధుమేహం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్లో ఒకటి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించకపోతే గుండె, కిడ్నీలు, కళ్ళు వంటి అవయవాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అందరికీ తెలిసిందే. మందులతోపాటు సరైన ఆహారం, వ్యాయామం, జీవనశైలి మార్పులు మధుమేహ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో ఇసబ్‌గోల్ మధుమేహ రోగులకు ఉపయోగకరమైన సహజ ఆహార పదార్థంగా గుర్తింపు పొందుతోంది. ఇసబ్‌గోల్‌లో అధికంగా ఉండే ద్రవీభవించే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుంది. దీంతో ఆహారంలోని కార్బోహైడ్రేట్లు శరీరంలో నెమ్మదిగా శోషణ అవుతాయి. ఫలితంగా భోజనం అనంతరం రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రణలో ఉండేందుకు సహాయపడుతుంది. ముఖ్యంగా టైప్-2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిల నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఫాస్టింగ్ షుగర్ తగ్గుతుంది..**

ఇసబ్‌గోల్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ (ఖీదీూ), ఎపూ1ప స్థాయిలు తగ్గే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించి శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా వినియోగించుకునేలా చేయడంలో కూడా ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. రక్తంలో చక్కెర నియంత్రణతోపాటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, జీర్ణక్రియ మెరుగుపరచడంలో కూడా ఇసబ్‌గోల్ ఉపయోగపడుతుంది. జీర్ణ సమస్యలను తగ్గించి జీర్ణ వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇసబ్‌గోల్ తీసుకునే సరైన సమయం భోజనం ముందు అని సూచిస్తున్నారు. ముఖ్యంగా అధిక కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తినే ముందు 10 నుంచి 20 నిమిషాల ముందు తీసుకుంటే భోజనం తర్వాత గ్లూకోజ్ పెరుగుదలను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని చెబుతున్నారు.

**ఎంత పరిమాణంలో తీసుకోవాలి..**

సాధారణంగా దీనిని రోజుకు 5 నుంచి 10 గ్రాముల వరకు, అంటే ఒక టేబుల్ స్పూన్ పరిమాణంలో తీసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే మొదట తక్కువ మోతాదుతో ప్రారంభించి క్రమంగా పెంచడం మంచిదని చెబుతున్నారు. ఇసబ్‌గోల్ నీటిని ఎక్కువగా శోషించుకునే గుణం కలిగి ఉండటంతో తప్పనిసరిగా తగినంత నీటితో తీసుకోవాలి. అలాగే ఇసబ్‌గోల్ తీసుకునేటప్పుడు తప్పకుండా పాటించాల్సిన జాగ్రత్తలు కూడా కొన్ని ఉన్నాయి. కనీసం ఒకటి లేదా రెండు గ్లాసుల నీటితో కలిపి తీసుకోవాలి. లేకపోతే గొంతులో ఇరుక్కోవడం లేదా జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. రోజంతా ఎక్కువగా ద్రవాలు తీసుకోవడం కూడా ఎంతో అవసరం. ఫైబర్‌ను ఒక్కసారిగా ఎక్కువగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు రావచ్చు, కాబట్టి మోతాదును నెమ్మదిగా పెంచడం మంచిది. అలాగే ఇది కొన్ని మందుల శోషణను ఆలస్యం చేసే అవకాశం ఉన్నందున ఇతర మందులు తీసుకునే ముందు లేదా తర్వాత కనీసం రెండు గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**వీరు తీసుకోకూడదు..**

మింగడంలో ఇబ్బందులు ఉన్నవారు లేదా పేగు ఆడకపోవడం వంటి సమస్యలు ఉన్నవారు ఇసబ్‌గోల్ వాడకూడదని హెచ్చరిస్తున్నారు. మధుమేహ రోగులు దీన్ని ప్రారంభించిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరిశీలించుకోవడం అవసరం. అవసరమైతే వైద్యులు మందుల మోతాదును మార్చాల్సి రావచ్చని చెబుతున్నారు. ఇసబ్‌గోల్ మధుమేహ నియంత్రణకు సహాయపడే సహజ ఆహార పదార్థమే గానీ, ఇది వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరైన ఆహారం, వ్యాయామం, మందులు, వైద్యుల సూచనలతోపాటు దీన్ని ఉపయోగిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చని చెబుతున్నారు.

## వేసవిలో ఎక్కువగా వచ్చే కడుపు ఉబ్బరం సమస్య తగ్గాలంటే.. వీటిని తినండి..

వేసవి కాలంలో కడుపు ఉబ్బరం (బ్లోటింగ్) సమస్య చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. ముఖ్యంగా వేడి ఎక్కువగా ఉన్న సమయంలో శరీరంలో నీటి లోపం, అజీర్ణం, తిన్న ఆహారం నెమ్మదిగా జీర్ణం కావడం వంటి కారణాల వల్ల పొట్ట ఉబ్బినట్లు, భారంగా అనిపించడం సాధారణమే. ఇలాంటి సమయంలో శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు జీర్ణక్రియకు సహాయపడే పండ్లను తీసుకోవాలని చూస్తూ ఉంటారు. అందులో బొప్పాయి అనాసపండు ప్రధానంగా చర్చకు వస్తాయి. ఈ రెండు పండ్లలో కూడా జీర్ణక్రియకు ఉపయోగపడే ప్రత్యేక ఎంజైములు ఉండటంతో, బ్లోటింగ్ తగ్గించడంలో సహాయపడతాయని భావిస్తారు. అయితే ఏ పండు ఎలాంటి పరిస్థితుల్లో ఎక్కువ ప్రయోజనం ఇస్తుందో తెలుసుకోవడం అవసరం. అసలు వేసవిలో బ్లోటింగ్ ఎందుకు ఎక్కువ అవుతుంది? అలాంటి సమయంలో ఏ పండును తీసుకోవడం ద్వారా చక్కటి ఫలితాలను పొందవచ్చు .. అన్న వివరాలను వైద్యులు వివరిస్తున్నారు.



**కడుపు ఉబ్బరం ఎందుకు..**

వేసవి కాలంలో అధిక చెమట వల్ల శరీరంలో నీటి లోపం ఏర్పడుతుంది. దీని ప్రభావం జీర్ణవ్యవస్థపై పడుతుంది. నీరు తక్కువగా ఉండటం వల్ల ఆహారం సరిగా జీర్ణం కాక పొట్ట ఉబ్బరం సమస్య వస్తుంది. అలాగే వేసవిలో ఎక్కువగా పండ్లు తినడం, ఒకేసారి అధిక మోతాదులో తీసుకోవడం కూడా గ్యాస్, ఫెర్మెంటేషన్‌కు (పులవడం) దారితీస్తుంది. వేడి కారణంగా జీర్ణక్రియ మందగించడం కూడా మరో కారణంగా ఉంటుంది. సాధారణంగా బొప్పాయిలో పపైన్ అనే జీర్ణ ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను విభజించి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. అందువల్ల పొట్టలో భారంగా అనిపించడం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. బొప్పాయి తేలికగా జీర్ణమయ్యే పండు. ఇందులో తక్కువ ఆమ్లత్వం (ాశీష ాూెఱఅ) ఉండటం వల్ల సున్నితమైన జీర్ణాశయం ఉన్నవారికి కూడా అనుకూలంగా ఉంటుంది. అలాగే ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గించి, పొట్ట సాఫీగా పనిచేయడానికి సహాయపడుతుంది.

**ప్రోటీన్లను జీర్ణం చేసే పైనాపిల్..**

అలాగే అనాసపండులో బ్రోమెలైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది. ఇది కూడా ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మాంసాహారం లేదా అధిక ప్రోటీన్ ఉన్న ఆహారం తిన్న తర్వాత తీసుకుంటే జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అయితే అనాసపండులో సహజ ఆమ్లత్వం ఎక్కువగా ఉంటుంది. అలాగే చక్కెర శాతం కూడా కొంత ఎక్కువగా ఉండటం వల్ల సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో గ్యాస్, కడుపు మంట, బ్లోటింగ్‌ను మరింత పెంచే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు.

**జీర్ణక్రియకు పనిచేసే బొప్పాయి..**

ఇక ఈ పండ్ల మధ్య ముఖ్య తేడాలను గమనించినట్లయితే బొప్పాయిలోని పపైన్ సాధారణ జీర్ణక్రియను సాఫీగా ఉంచడంలో సహాయపడుతుంది. అనాసలోని బ్రోమెలైన్ మరింత శక్తివంతంగా పనిచేసి గట్టి ప్రోటీన్లను విభజిస్తుంది. బొప్పాయి తక్కువ ఆమ్లత్వం కలిగిన పండు. అనాసపండు సహజంగా ఆమ్ల గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది. అదే విధంగా బొప్పాయిలోని ఫైబర్ పొట్టకు మృదువుగా పనిచేస్తుంది. అనాసలో కొంత ఎక్కువ ఇన్సోల్యూబుల్ ఫైబర్ ఉండటంతో కొందరిలో గ్యాస్ సమస్య పెరుగుతుంది. సున్నితమైన జీర్ణాశయం లేదా ×దీూ సమస్య ఉన్నవారికి బొప్పాయి ఎక్కువగా అనుకూలంగా భావిస్తారు. అనాసపండు కొందరిలో జీర్ణాశయం గోడలకు చికాకు కలిగించే అవకాశం ఉంటుంది.

**కడుపు ఉబ్బరం అధికంగా ఉంటే..**

అలాగే భారీగా భోజనం చేసిన తర్వాత వచ్చే భారంగా అనిపించే బ్లోటింగ్‌కు బొప్పాయి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తిన్న తర్వాత అనాసపండు కొద్దిమోతాదులో తీసుకుంటే సహాయపడుతుంది. ×దీూ లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు బొప్పాయిని ఎంచుకోవడం మంచిదిగా భావిస్తున్నారు. యాసిడ్ రిఫ్లక్స్ లేదా కడుపుమంట సమస్య ఉన్నవారు అనాసపండును తగ్గించడం మంచిది. పండ్లు ఆరోగ్యకరమైనవే అయినా, అధిక మోతాదులో తీసుకుంటే సమస్యలు వస్తాయి. ముఖ్యంగా వేసవిలో కేవలం పండ్లతోనే భోజనం చేయడం లేదా ఒకేసారి ఎక్కువగా తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. అందువల్ల పరిమిత మోతాదులో తీసుకోవడం అవసరం. బ్లోటింగ్ సమస్యను తగ్గించడంలో బొప్పాయి సాధారణంగా సురక్షితమైన, జీర్ణాశయానికి మృదువైన ఎంపికగా భావిస్తున్నారు. అనాసపండు కూడా జీర్ణక్రియకు సహాయపడినా, అది ప్రతి ఒక్కరికీ సరిపోవచ్చు అనడం కష్టం. వ్యక్తిగత జీర్ణవ్యవస్థ, ఆహార అలవాట్లు, ఆరోగ్య పరిస్థితులను బట్టి ఈ పండ్ల ప్రభావం మారవచ్చు. కాబట్టి తరచూ బ్లోటింగ్ సమస్య ఉంటే పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## యుక్త వయస్సులో బరువు వేగంగా పెరిగితే.. మరణ ప్రమాదం ఎక్కువే.. పరిశోధనలో వెల్లడి..

యుక్త వయస్సులో వేగంగా బరువు పెరగడం భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని తాజా పరిశోధన హెచ్చరించింది. ముఖ్యంగా టీనేజ్ చివరి దశ నుంచి 20ల వయస్సు వరకు అధిక బరువు పెరిగిన వారిలో అకాల మరణ ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు, స్ట్రోక్ వంటి వ్యాధుల ముప్పు కూడా ఎక్కువవుతుందని అధ్యయనం వెల్లడించింది. స్వీడన్‌లో నిర్వహించిన ఈ అధ్యయనంలో 17 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 6 లక్షల మందికి పైగా వ్యక్తుల బరువు మార్పులను పరిశీలించారు. బరువు వేగంగా పెరిగినవారిలో మరణాల రేటు ఎక్కువగా కనిపించిందని పరిశోధకులు తెలిపారు. ముఖ్యంగా చిన్న వయస్సులోనే ఊబకాయం ప్రారంభమైతే శరీరం ఎక్కువకాలం మెటబాలిక్ ఒత్తిడికి గురవుతుందని, ఇది గుండె, రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.



**70 నుంచి 84 శాతం పెరిగిన ప్రమాదం..**

29 ఏళ్ల వయస్సుకల్లా ఊబకాయంతో బాధపడుతున్న వారిలో అకాల మరణ ప్రమాదం 70 నుంచి 84 శాతం వరకు పెరిగినట్లు అధ్యయనం తెలిపింది. మహిళల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం. గుండెపోటు, స్ట్రోక్, టైప్-2 డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు కూడా వీరిలో అధికంగా కనిపించాయని వెల్లడించారు. పురుషుల్లో చిన్న వయస్సులో బరువు పెరగడం కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును పెంచగా, మహిళల్లో మాత్రం క్యాన్సర్ ప్రమాదంలో అంత స్పష్టమైన మార్పు కనిపించలేదని అధ్యయనం పేర్కొంది. మెనోపాజ్ సమయంలో జరిగే హార్మోన్ల మార్పులు కూడా దీనికి కారణం కావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. సగటున ప్రతి ఏడాది సుమారు 0.4 కిలోల బరువు పెరిగినప్పటికీ, దీర్ఘకాలంలో అది పెద్ద ప్రభావం చూపుతుందని అధ్యయనం తెలిపింది. 17 నుంచి 30 ఏళ్ల మధ్య దాదాపు 6.5 కిలోల బరువు పెరిగిన వారిలో కూడా మరణ ప్రమాదం పెరిగినట్లు గుర్తించారు.

**ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలి..**

చిన్న వయస్సులో బరువు పెరగడం వల్ల శరీరం ఎక్కువకాలం అధిక కొవ్వు ప్రభావానికి గురవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, శరీరంలో దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ (వాపు) ఏర్పడటం వంటి సమస్యలు వస్తాయి. తక్కువ శారీరక శ్రమ, ఒత్తిడి, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు యువతలో బరువు పెరుగుదలకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. యువత బరువు నియంత్రణ కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ కేలరీల ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం ఐదు సార్లు పండ్లు, కూరగాయలు తినడం మంచిదని చెబుతున్నారు. రోజూ అదనంగా 2,000 అడుగులు నడవడం, వారానికి కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయడం, వారంలో రెండు సార్లు శక్తివర్ధక వ్యాయామాలు చేయడం ఉపయోగకరమని సూచిస్తున్నారు. అలాగే ప్రతిరోజూ బరువును పరిశీలించడం, ఆకలి లేకున్నా కూడా తినే అలవాట్లను తగ్గించడం, నీటిని ఎక్కువగా తాగడం, అల్పాహారం మానకుండా సమయానికి భోజనం చేయడం వంటి చిన్న మార్పులు కూడా బరువు నియంత్రణలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

బిజినెస్


# ఉగాండా గతి మార్చిన భారత్

## జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ



భారత వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ ని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమించారు. రిలయన్స్‌కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9 నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7న సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొన్నది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016 లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది.

## అమెరికా దిగ్గజ సంస్థల్లో లేఆఫ్‌లు..!




**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రముఖ నెట్‌వర్కింగ్ సంస్థ 'సిస్కో'.. మరోవిడత ఉద్యోగ కోతలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో దాదాపు 4,000 మందిని తొలగించాలని యోచిస్తున్నట్లు తెలిపింది ఇది మొత్తం సిబ్బందిలో 5 శాతం కంటే తక్కువని పేర్కొంది. దీర్ఘకాలిక వృద్ధికి సంబంధించిన రంగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నంలో భాగంగానే ఈ మార్పులు ఉన్నాయని సీఈవో చక్ రాబిన్స్ వివరించారు. మరోవైపు.. మూడో త్రైమాసికంలో 12 శాతం వృద్ధితో 15.8 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్లు కంపెనీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్ నేతృత్వంలోని లింక్డిన్ వందల సంఖ్యలో ఉద్యోగాలను తొలగించనుంది. మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం అంటే దాదాపు 875 మందిని తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు పలు మార్పులు అమలుచేశామని ఈ అమెరికా సంస్థ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. మరోవైపు వాల్‌మార్ట్ 1000 మంది ఉద్యోగులను తొలగించనుంది లేక వేరే విభాగాలకు బదిలీ చేయనుంది. ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థ వాల్‌మార్ట్ వెల్లడించింది. గ్లోబల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొడక్ట్ బృందాలను విలీనం చేయనుంది.

అది 1972... గడియారపు ముళ్లు వేగంగా తిరుగుతున్నాయి. చేతిలో కేవలం తొంభై రోజుల గడువు. కళ్ల ముందే తాము ఎంతో కష్టపడి నిర్మించుకున్న సామ్రాజ్యాలు కుప్పకూలుతుంటే కట్టుబట్టలతో, కన్నీటి మూటలతో ఒక జాతి పరాయి దేశాల వైపు అడుగులు వేసింది. ఆనాడు ఉగాండా నేల విడిచి వెళ్లిన చాలా మందిలో తీరని వేదన. కానీ, కాలం పగ తీర్చుకోలేదు.. ఆ గాయాన్ని మాన్పేసింది. అర్ధ శతాబ్దం గడిచింది. నాడు బహిష్కరించిన అదే మనుషులు, నేడు ఎర్ర తివాచీ పరిచారు. అప్పుడు అక్కడి నుంచి బయటకు వెళ్లిన వారే, ఇప్పుడు ఆ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారారు. చక్కెర మిల్లులు, స్టీలు పరిశ్రమలు, బ్యాంకింగ్ వ్యవస్థ... ఇలా అన్ని రంగాల్లో భారతీయులు వ్యాపారం సాగిస్తూ దేశ వృద్ధికి తోడ్పడుతున్నారు.



**90 రోజుల గడువు.. తరాల కష్టం బుగ్గిపాలు**

ఆగస్టులో ఉగాండా సైనిక పాలకుడు ఇడి అమీన్ తీసుకున్న నిర్ణయం ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. స్థానికులను దోపిడీ చేస్తున్నారనే సాకుతో దాదాపు 80,000 మంది భారత సంతతి ప్రజలను కేవలం 90 రోజుల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. దశాబ్దాలుగా నిర్మించుకున్న వ్యాపారాలు, చక్కెర మిల్లులు, బ్యాంకులు, ఆస్తులను వదిలి వారంతా బ్రిటన్, కెనడా, భారత్‌లకు శరణార్థులుగా వెళ్లారు. ఫలితంగా ఉగాండాలో 90 శాతం వ్యాపారాలు మూతపడ్డాయి. సరఫరా గొలుసు కుప్పకూలి దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లింది.

**గణాంకాలు ఇలా..**

1972-75 మధ్య ఉగాండా జీడీపీ 5% మేర పడిపోయింది. 1972లో 740 మిలియన్ షిల్లింగ్‌లుగా ఉన్న ఉత్పత్తి 1979 నాటికి 254 మిలియన్లకు దిగజారింది.

ముసెవెని పిలుపుతో మారిన దశ

1986లో యోవేరి ముసెవెని అధికారం చేపట్టాక పరిస్థితి తలకిందులైంది. అమీన్ నిర్ణయాన్ని చారిత్రక తప్పిదంగా అభివర్ణించిన ఆయన, భారతీయులను తిరిగి రావాల్సిందిగా ఆహ్వానించారు. వారి ఆస్తులను తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారు. 'మనం పోగొట్టుకున్నది కేవలం వ్యక్తులను కాదు, దేశ ఆర్థిక పునాదులను. భారతీయులు ఉగాండా రక్తంలో భాగం' అని యోవేరి ముసెవెని (అధ్యక్షుడు) అన్నారు.

**ఆర్థిక సామ్రాజ్యాల పునరుద్ధరణ**

తిరిగి వచ్చిన భారతీయులు వ్యాపారాలు చేయడంతోపాటు దేశ భవిష్యత్తును మార్చేశారు. ప్రస్తుతం ఉగాండా జనాభాలో కేవలం 1 శాతం కంటే తక్కువగా ఉన్న భారతీయులు దేశ ఆదాయపు పన్నులో 65 శాతం వాటాను అందిస్తున్నారంటే వారి ప్రాధాన్యత అర్థం చేసుకోవచ్చు.

**సుధీర్ రుపారేలియా**

బహిష్కరణ సమయంలో లండన్‌కు పారిపోయి చిన్న ఉద్యోగాలు చేసిన సుధీర్ కేవలం 25,000 డాలర్లతో తిరిగి వచ్చి నేడు ఉగాండాలోనే అత్యంత ధనవంతుడిగా ఎదిగారు. బ్యాంకింగ్, విద్య, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఆయనది తిరుగులేని ముద్ర.

**మధ్వానీ గ్రూప్**

గుజరాత్ నుంచి వలస వచ్చిన ముల్జీభాయ్ మాధ్వానీ స్థాపించిన ఈ సంస్థ నేడు తూర్పు ఆఫ్రికాలోనే అతిపెద్ద వ్యవసాయ-పారిశ్రామిక సంస్థగా ఎదిగింది. 'కకీరా షుగర్ వర్క్స్' ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ 70,000 కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఈ గ్రూప్ జీవనాధారంగా ఉంది.

**మెహతా, ముక్వానో గ్రూప్స్**

మెహతా గ్రూప్ అధినేత మహేంద్ర మెహతాకు భారత ప్రభుత్వం 'ప్రవాసీ భారతీయ సమ్మాన్' పురస్కారం ఇచ్చి గౌరవించింది. అలాగే ముక్వానో గ్రూప్ సబ్బులు, నూనెలు వంటి నిత్యావసర వస్తువుల ఉత్పత్తిలో ఎ?ంతో ఎదిగింది.

**భారత్ - ఉగాండా సంబంధాలు**

ప్రస్తుతం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1.2 బిలియన్ డాలర్లను దాటింది. ఫార్మా, మౌలిక సదుపాయాలు, ఉక్కు, విద్య వంటి రంగాల్లో భారతీయ సంస్థల పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. చైనా పెట్టుబడులతో పోలిస్తే భారతీయ వ్యాపారవేత్తలు స్థానిక ప్రజలతో మమేకమై పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మిస్తూ అక్కడ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. అయితే, ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో భారతీయుల ఆర్థిక ఆధిపత్యంపై కొన్ని వర్గాల్లో అసహనం ఉన్నప్పటికీ, ఇండియన్స్ లేని ఉగాండా ఆర్థిక వ్యవస్థను ఊహించడం అసాధ్యమని మెజారిటీ ప్రజల నమ్మకం. ఒకప్పుడు బహిష్కరణకు గురైన ఒక జాతి, అదే దేశానికి ఆర్థిక రక్షకులుగా మారడం అనేది ప్రపంచ చరిత్రలోనే అరుదైన దృశ్యం.

## మెట్రోలో ప్రయాణించిన ఉబర్ సీఈఓ.. అద్భుతం అంటూ ప్రశంసలు

**ఇంటర్నెట్‌డెస్క్:** ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి ఇటీవల భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో ప్రయాణం అద్భుతంగా ఉందంటూ ఆయన ఓ వీడియోను పంచుకున్నారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ అవుతోంది. మోదీ జాకెట్ ధరించి.. ఒక సాధారణ ప్రయాణికుడిలా ఖోస్రోషాహి మెట్రోలో ప్రయాణించారు. 'లక్షలాది మంది ప్రజలు తమ రోజువారీ విధులకు వెళ్లేందుకు ఈ మెట్రోను ఉపయోగిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఉబర్ యాప్ ద్వారా మెట్రో టికెట్ బుక్ చేసుకుని తన ప్రయాణాన్ని పూర్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రయాణం ఎంతో సాఫీగా, సమర్థవంతంగా సాగిందన్నారు. సాధారణ ప్రజలకు ఇది అందుబాటు ధరలో ఉందని, నమ్మదగినదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఉబర్ కేవలం కార్ రైడ్‌లకే పరిమితం కాదన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటో, బస్సులు, మెట్రో వ్యవస్థలతో సహా అన్ని రవాణా మార్గాలను ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకురావడమే తమ కంపెనీ లక్ష్యమన్నారు. భారత్‌లోని ప్రజా రవాణా వ్యవస్థలతో ఉబర్ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా తమ యాప్ ద్వారా కోటికి పైగా మెట్రో రైడ్‌లు బుక్ అయ్యాయన్నారు.




# ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా బుమ్రా.. ఒకే సీజన్‌లో ముగ్గురికి పగ్గాలు?

స్పోర్ట్స్




పంతొమ్మిదో సీజన్‌లో ఘోరమైన ఆటతో టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ ఇక పరువు కోసం పోరాడనుంది. పోతూ పోతూ ఇతర జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీయాలనుకుంటోంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు సైతం కెప్టెన్ హార్దిక్ పాండ్యా అందుబాటులో ఉండడం లేదు. అలానే తాత్కాలిక నాయకుడు సూర్యకుమార్ యాదవ్ సైతం దూరం కానున్నాడు. ఈ నేపథ్యంలో పేసర్ జస్ప్రీత్ బుమ్రా ముంబై సారథిగా వ్యవహరించనున్నాడని సమాచారం. అదే జరిగితే.. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు సారథులతో ఆడిన రికార్డు ముంబైకి సొంతమవ్వనుంది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ పంతొమ్మిదో సీజన్‌లో ఏదీ కలిసి రాలేదు. జట్టు నిండా స్టార్లు, టీ20 వరల్డ్ కప్ విజేతలు ఉన్నా సరే అనూహ్యంగా లీగ్ దశను దాటలేదు ముంబై. కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యూహాలు, పేలవ ఫామ్ అందుకు ఓ కారణం కాగా.. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ వైఫల్యం ముంబైని దెబ్బతీశాయి. దాంతో.. గత రెండు మ్యాచ్‌లకు పాండ్యాను పక్కన పెట్టిన ముంబై సూర్యకు పగ్గాలు అప్పగించినా ఫలితం మారలేదు. ఒకప్పుడు ప్రత్యర్థులను గడగడ వణికించిన ముంబై.. ఈసారి ఎనిమిది ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించడాన్ని యాజమాన్యం, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మిగిలిన మ్యాచులన్నీ గెలిచి పరువు కాపాడుకోవాలనుకుంటున్న ముంబైని మూడో కెప్టెన్ నడపించడం ఖాయమనిపిస్తోంది. అవును.. గురువారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు పాండ్యా, తాత్కాలిక సారథి సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ అందుబాటులో ఉండడం లేదు. వీరిద్దరు జట్టుతో కలిసి నెట్స్‌లో పాల్గొనకపోవడమే అందుకు కారణం. దాంతో.. ఐదుసార్లు ట్రోఫీ అందించిన రోహిత్ శర్మ ఉన్నప్పటికీ బుమ్రా లేదంటే తిలక్ వర్మలో ఒకరికి పగ్గాలు అప్పగిస్తారని సమాచారం. సీనియరైన బుమ్రాకే యాజమాన్యం, కోచ్ మహేల జయవర్ధనే ఓటేసే అవకాశముంది. ఒకవేళ టాస్‌కు బుమ్రా వస్తే ఒకే సీజన్‌లో ముగ్గురు సారథులతో ఆడిన జట్టుగా ముంబై రికార్డు పట్టేయనుంది. 2013 నుంచి.. ఇప్పటివరకూ అంటే 13 ఏళ్లుగా ఫ్రాంచైజీ కోసం తన చెమటను ధార పోసిన అతిడికే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినా ఆశ్చర్యమేమీ లేదు.

**పాండ్యాను అమ్మేస్తారా..!**

ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించి.. కెప్టెన్‌గా ఎదిగిన హార్దిక్ పాండ్యా భవితవ్యం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గుజరాత్ టైటాన్స్‌కు అరంగేట్రంలోనే ట్రోఫీ అందించి.. ఆ తర్వాతి ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిపిన పాండ్యా ముంబై తరఫున అట్టర్‌ఫ్లాప్ అయ్యాడు. రెండు సీజన్లలోనూ అటు సారథిగా, ఇటు ఆటగాడిగా అతడు మెప్పించలేకపోయాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో సమస్యలు సద్దుమణిగి.. అంతా పాండ్యా మాట వింటారు అనే సంకేతాలిచ్చినా ముంబై ఆట మారలేదు. 8 మ్యాచుల్లో 146 పరుగులే చేసిన ఈ ఆల్‌రౌండర్.. బంతితో మరీ ఘోరంగా 4 వికెట్లే తీశాడు. 19వ సీజన్‌లో ముంబైని గెలిపించడంలో విఫలమైన పాండ్యాను ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు అతడిని అమ్మేసేందుకు ముంబై సిద్ధమైందనే కథనాలు వస్తున్నాయి. కానీ, ఈ వార్తలపై ఫ్రాంచైజీ మాత్రం ఇంకా ప్రకటించలేదు. చూస్తుంటే.. పొమ్మనలేక పొగబెట్టినట్టుగా పాండ్యా పరిస్థితి తయారైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రియురాలు మహీకా శర్మతో మైదానంలో నానా రచ్చ చేయడం కూడా పాండ్యాపై విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే.

## బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు!.. స్పందించిన కమిన్స్




తనపై వస్తున్న వదంతులపై ఆస్ట్రేలియా టెస్టు, వన్డే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. తన గురించి రాస్తున్న దాంట్లో ఏమాత్రం నిజం లేదంటూ కొట్టిపారేశాడు. ఆసీస్ టెస్టు, వన్డే సారథిగా కమిన్స్‌కు గొప్ప రికార్డు ఉంది. మిచెల్ స్టార్క్‌తో పాటు పేస్ దళంలో బౌలర్‌గానూ కమిన్స్ కీలకం. అయితే, కమిన్స్‌తో పాటు మరికొందరు సీనియర్ క్రికెటర్లు క్రికెట్ ఆస్ట్రేలియాను ను బెదిరిస్తున్నారంటూ 'ది ఏజ్' కథనం పేర్కొంది. తమ జీతాలు పెంచకపోతే దేశీ టీ20 లీగ్ బిగ్‌బాష్ లీగ్ (దీదీూ)ను బహిష్కరిస్తామని వాళ్లు బ్లాక్‌మెయల్ చేశారన్నది ఆ కథనం సారాంశం.

**దాదాపు రూ. 7 కోట్లు**

2027-28 సీజన్‌కు గానూ.. ఒకవేళ తాము కోరినట్లు 1 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 7 కోట్లు) చెల్లించకపోతే.. ఈ సీజన్‌లో ఆడేది లేదని ఆటగాళ్లు తేల్చిచెప్పినట్లు సదరు కథనం పేర్కొంది. బీబీఎల్‌ను వదిలి సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ఆడేందుకు వెళ్తామని హెచ్చరించినట్లు తెలిపింది.

**నువ్వు రాసినదంతా కల్పితం**

ఇందుకు సంబంధించిన వార్తను ఓ నెటిజన్ 'ఎక్స్'లో షేర్ చేయగా.. ప్యాట్ కమిన్స్ ఘాటుగా స్పందించాడు. "ది హండ్రెడ్ లీగ్‌లో నాకు ఆఫర్ వచ్చినట్లు.. సౌతాఫ్రికా టీ20 లీగ్ నిరభ్యంతర పత్రం విషయంలో నేనేదో డిమాండ్ చేసినట్లు.. నా గురించి నువ్వు రాసినదంతా కల్పితం మాత్రమే" అని కమిన్స్ బదులిచ్చాడు. కాగా వెన్నునొప్పి కారణంగా ఇంగ్లండ్‌తో ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన కమిన్స్.. ఆ తర్వాత ఆటకు దూరమయ్యాడు. దాదాపు నాలుగు నెలల పాటు విశ్రాంతి తీసుకున్న ఈ పేస్ బౌలర్.. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ విధులతో బిజీగా ఉన్నాడు. అయితే, ఐపీఎల్-2026లో సన్‌రైజర్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమైన కమిన్స్... ఇటీవలే తిరిగి వచ్చి జట్టును విజయపథంలో తీసుకువెళ్తున్నాడు. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటికి 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకుని ఏడు గెలిచింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉన్న కమిన్స్ బృందం ప్లే ఆఫ్స్ బెర్తు లక్ష్యంగా ముందుకు సాగుతోంది.



# పెద్ది' పవర్ ప్లే టూర్ షురూ..
# 8 రోజుల్లో 7 నగరాలు, భారీ వేడుకలకి పక్కా స్కెచ్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్, రెండు పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ఈ సినిమాలో రామ్ చరణ్ కుస్తీతో పాటు క్రికెట్ ఆడే పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన విజువల్స్ స్పష్టం చేశాయి. మాస్, ఎమోషన్, స్పోర్ట్స్ అంశాల కలయికగా రూపొందుతున్న ఈ చిత్రంపై రోజురోజుకీ హైప్ పెరుగుతోంది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. ఓ అభిమాని "పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?" అంటూ లేఖ రాయగా, దానికి స్పందించిన చిత్రబృందం 'పవర్ ప్లే టూర్' పేరుతో ప్రత్యేక ప్రమోషనల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో ఏ తేదీన ఏ నగరంలో ఈవెంట్ జరుగుతుందో ప్రకటించారు. మే 18న ముంబైలో భారీ వేడుక నిర్వహించి 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత మే 22న ఉప్పల్ స్టేడియంలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక సంగీత కచేరీ నిర్వహించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. మే 23న భోపాల్‌లో ప్రత్యేక పాటల విడుదల కార్యక్రమం ఉండనుండగా, మే 24న బెంగళూరులో మరో భారీ ఈవెంట్ జరగనుంది. అనంతరం మే 28న ఢిల్లీలో, మే 30న చెన్నైలో ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక జూన్ 1న విజయనగరంలో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సినిమా కథ విజయనగరం నేపథ్యంతో సాగనున్న నేపథ్యంలో అక్కడి ఈవెంట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. చివరగా జూన్ 2న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకను అభిమానుల మధ్య నిర్వహించనున్నారు. మొత్తంగా కేవలం 8 రోజుల్లో 7 నగరాల్లో 'పెద్ది' ప్రమోషన్స్ ప్లాన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. "ఇదే అసలైన పాన్ ఇండియా ప్రమోషన్" అంటూ రామ్ చరణ్ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ట్రైలర్ విడుదలతో 'పెద్ది' ఫీవర్ మరింత పెరగనుందని, విడుదలకు ముందే సినిమా దేశవ్యాప్తంగా భారీ హైప్ సృష్టించడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# రష్మిక కష్టాలు ..
# కాళ్లకు టేప్ వేసుకొని మరి..!

।స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. "ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం" అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# హీరో ఇష్యూ మానసికంగా నన్ను ఇబ్బంది పెట్టింది..
# చాలా బాధ పడ్డాను..



నిత్యా మీనన్ కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 50కి పైగా సినిమాల్లో నటించి తనదైన ముద్ర వేశారు. 2011లో వచ్చిన 'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసి మొదటి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'జనతా గ్యారేజ్' 'భీమ్లా నాయక్' వంటి సినిమాలతో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో నిత్యా మీనన్ మాట్లాడుతూ ఓ హీరో ఇష్యూ కారణంగా తాను చాలా బాధపడ్డానని అన్నారు. నిత్యా మీనన్ కెరీర్ ఆరంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ప్రభాస్ ఎవరు?" అని అడగడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ విషయంపై ఆమె క్లారిటీ ఇస్తూ, ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదాన్నని, కేవలం ఆ ఒక్క మాటను పట్టుకుని తనను చాలా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన నిజాయితీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఆ విషయాన్ని పెద్దది చేశారని ఆమె పేర్కొన్నారు. ఆ సంఘటన తర్వాతే అందరి దగ్గర నిజాయితీగా ఉండకూడదని, కొన్నిసార్లు 'డిప్లొమాటిక్'గా వ్యవహరించడం అవసరమని తాను నేర్చుకున్నానని నిత్య చెప్పారు. "ప్రతి ఒక్కరూ నా నిజాయితీకి అర్హులు కారు" అని ఆ ఇష్యూ ద్వారా తనకు అర్థమైందని, ఆ తర్వాతే తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని వివరించారు. ప్రభాస్ ఇష్యూ కారణంగా తాను మానసికంగా ఇబ్బంది పడ్డానని అన్నారు. అలాగే తన గురించి వచ్చిన ట్రోల్స్ పై స్పందిస్తూ.. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని, ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫోటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని ఆమె తెలిపారు. కొన్ని ఘటనలు తన జీవితంలో ఒక పెద్ద పాఠం నేర్పిందని, అప్పటి నుండి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారానని నిత్యా మీనన్ ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

# నాగబాబు మేము'కాప్'లం ట్రైలర్ వచ్చేసింది



జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే "మేము'కాప్'లం". కొన్నాళ్ల నుంచి ఈ సిరీస్ టైటిల్ దగ్గర నుంచి ప్రతీ విషయంలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. మే 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా "మేము'కాప్'లం" ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. మహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకటానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. దీంతో వాళ్లు కొత్త సమస్య నుంచి ఊరిని బయటపడేయటానికి ప్రయత్నిస్తారు. ఇంతకీ మహదేవపట్నంలోని ప్రధాన సమస్య ఏంటి? పోలీసులు దాన్ని ఎలా పరిష్కరిస్తారు. అసలు ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే మే 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న "మేము'కాప్'లం" వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.

నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన "మేము 'కాప్'లం" సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు. గెటప్ శ్రీను, రవితేజ నన్నిమల కీలక పాత్రల్లో నటించారు. కామెడీ, మిస్టరీ కలయికగా అందరినీ ఆకట్టుకునే కథాంశంతో..గ్రామీణ నేపథ్యంలో, అక్కడి రోజువారీ జీవితం, స్థానిక రాజకీయాలు, ఊహించని గందరగోళం..ఇలా అన్నీ కలగలిపిన ఆసక్తికరమైన కథతో ఈ సిరీస్ తెరకెక్కింది.



# విరోష్ జంట.. సోషల్ మీడియాలో సరికొత్త రికార్డ్

ఈ ఏడాది పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన జంట విజయ్– రష్మిక. కొన్నేళ్లుగా డేటింగ్ ఉన్న వీరిద్దరు ఉదయ్‌పూర్ వేదికగా ఒక్కటయ్యారు. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లిబంధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో టాలీవుడ్ సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఈవెంట్ నిర్వహించారు. అయితే విరోష్ జంటగా క్రేజ్ తెచ్చుకున్న వీరిద్దరు ఓ యాడ్ ప్రమోట్ చేశారు. ప్రముఖ ఎయిర్ బీఎన్ బీ కపుల్ యాడ్‌లో పాల్గొన్నారు. దీనికి ఏకంగా 9.1 మిలియన్ లైక్స్ వచ్చాయి. దీంతో ఇన్‌స్టాలో మరో గ్లోబల్ రికార్డ్ క్రియేట్ జంటగా విరోష్ జోడీ నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యాడ్‌కు వరల్డ్ వైడ్‌గా వచ్చిన రెండో అత్యధిక లైక్స్ ఇవే కావడం విశేషం. దీంతో విజయ్– రష్మిక ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం వీరిద్దరు జంటగా రణబాలిలో కనిపించనున్నారు.

మొదటి ప్లేస్ కూడా వీరిదే..

ఈ జాబితాలో మొదటి స్థానం రికార్డ్ సైతం వీరిదే కావడం గమనార్హం. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన మాన్యవార్ అనే వెడ్డింగ్ యాడ్ 11.5 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీనికి తోడు 104 మిలియన్ల వ్యూస్ రావడం విశేషం. ప్రముఖ దిగ్గజాలు మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో వంటి గ్లోబల్ ఐకాన్స్ కలిసి చేసిన ఇంటర్నేషనల్ బ్రాండ్ యాడ్స్‌కు మించిన ఆదరణ విరోష్ జంటకు అందరినీ షాకింగ్‌కు గురి చేస్తోంది.

# రాహుల్ గాంధీ ఆదాయం, విదేశీ పర్యటనల ఖర్చుల్లో వ్యత్యాసం ఉంది

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర సంచలన ఆరోపణలు చేశారు. రాహుల్‌కు ఏటా వచ్చే వార్షిక ఆదాయాలకు, ఆయన విదేశీ పర్యటనలకు చేస్తున్న ఖర్చులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందన్నారు. ఫారిన్ పర్యటనల్లో ఖర్చు చేస్తున్న నిధుల మూలాలను రాహుల్ వెల్లడించాలని సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ గత 22 ఏళ్లలో 54 విదేశీ ట్రిప్పులకు వెళ్లారని, వాటి మొత్తం ఖర్చు రూ.60 కోట్ల దాకా అయిందన్నారు. కానీ కాంగ్రెస్ అగ్రనేత గత పదేళ్లలో ఫైల్ చేసిన ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన వార్షిక ఆదాయాలన్నీ కలుపుకున్నా రూ.11 కోట్లకు మించి ఉండవని సంబిత్ పాత్ర తెలిపారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మండిపడ్డారు. మోదీ సర్కారు వైఫల్యాల నుంచి ప్రజల చూపును మళ్లించడానికి, కేంద్ర మంత్రి పదవి కోసమే సంబిత్ పాత్ర ఇలాంటి ఆరోపణలు చేశారని విమర్శించారు.



**రూ. 20.39 కోట్ల ఆస్తులకు, రూ. 60 కోట్ల ఖర్చులకు పొంతనేది?**

"రాహుల్ గాంధీ ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2004లో ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ. 55.38 లక్షలు. 2024 నాటికి మొత్తం ఆస్తుల విలువ రూ. 20.39 కోట్లకు పెరిగింది. అంటే గత 22 ఏళ్లలో (2004 నుంచి 2026 వరకు) ఆస్తుల విలువ రూ. 55.38 లక్షల నుంచి రూ. 20.39 కోట్లకు చేరింది. సరిగ్గా ఇదే 22 ఏళ్ల వ్యవధిలో రాహుల్ గాంధీ 54 విదేశీ పర్యటనలకు దాదాపు రూ. 60 కోట్లను ఖర్చు చేశారు. రూ. 20.39 కోట్ల ఆస్తులకు, రూ. 60 కోట్ల విదేశీ పర్యటనల ఖర్చులకు లెక్క సరిపోవడం లేదు. ఈ విదేశీ పర్యటనలకు ఎవరు నిధులను సమకూర్చారో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వెల్లడించాలి" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు.

**'రహస్య పర్యటనలపై వివరణ ఇవ్వాలి'**

"రాహుల్ గాంధీ తన అనేక విదేశీ పర్యటనల వివరాలను వెల్లడించలేదు. ఈ రహస్య పర్యటనలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ అగ్రనేతకు ఉంది. ఇది చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల ప్రకారం ఏ ఎంపీ, న్యాయమూర్తి లేదా ప్రభుత్వ అధికారి విదేశీ పర్యటనలకు ఏదైనా ఏజెన్సీ నిధులను సమకూరిస్తే ప్రభుత్వం, హోం వ్యవహారాల శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఒకవేళ వ్యక్తిగత ఖర్చుతో ఏదైనా విదేశీ పర్యటనకు వెళితే, దాన్ని ఆదాయపు పన్ను రిటర్న్‌లో వెల్లడించాలి. మీరు విదేశాల్లో ఏదైనా బహుమతి అందుకున్నా లేదా మీపై వెల్లడి చేయని విధంగా డబ్బును ఖర్చు చేసినా, అది బ్లాక్ మనీ యాక్ట్ 2015 నిబంధనల పరిధిలోకి వస్తుంది. రాహుల్ తన విదేశీ పర్యటనల కోసం హోం శాఖ నుంచి ముందస్తు అనుమతిని పొందారా? ఆ పత్రాలు ఎక్కడ ఉన్నాయి? ఆయన ఆదాయపు పన్ను వివరాలను వెల్లడించారా?" అని సంబిత్ పాత్ర ప్రశ్నలు సంధించారు.

**'మస్కట్ పర్యటన దృశ్యాలను అందించాలి'**

"2025 సెప్టెంబరులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఆర్పీఎఫ్ ఒక లేఖ రాసింది. 2024 డిసెంబరు నుంచి 2025 సెప్టెంబరు మధ్య కాలంలో రాహుల్ గాంధీ చేసిన ఆరు అప్రకటిత విదేశీ పర్యటనలపై సీఆర్పీఎఫ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ పర్యటనలన్నీ ఎస్పీజీ రక్షణకు సంబంధించిన ఎల్లో బుక్ నిబంధనలను ఉల్లంఘించి జరిగాయి. అందువల్ల ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమని లేఖలో సీఆర్పీఎఫ్ పేర్కొంది. 2026 మే 3న రాత్రి ఒమన్‌లోని మస్కట్‌లో రాహుల్ చేసిన వ్యక్తిగత పర్యటనకు సంబంధించిన దృశ్యాలను అందించాలని మేం కోరుతున్నాం. మస్కట్‌లో తనకు ఆతిథ్యం ఇచ్చిన వారి వివరాలను కానీ, పర్యటన ప్రణాళికను కానీ కాంగ్రెస్ అగ్రనేత వెల్లడించలేదు. ఇంతకీ ఆయనను అక్కడికి ఎవరు ఆహ్వానించారు? ఎఫ్‌సీఆర్ఏ సెక్షన్ 6 కింద ఎలాంటి అనుమతినీ తీసుకోకుండా చేసిన పర్యటన అది" అని సంబిత్ పాత్ర వెల్లడించారు.

**'భారత ప్రభుత్వం రాహుల్‌ను వదిలిపెట్టదు'**

"ఒమన్ టూర్ సమాచారం రుజువైతే, అది ఎల్లో బుక్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించి జరిగిన ఏడో విదేశీ పర్యటన అవుతుంది. భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్న రాహుల్, రహస్య విదేశీ పర్యటనలు చేస్తుండటం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇంతకీ ఆయన ఏ ఉద్దేశంతో ఒమన్‌కు వెళ్లారు? అక్కడ ఎవరిని కలిశారు? అక్కడ దేశానికి వ్యతిరేకంగా ఏం మాట్లాడారు? ఎలాంటి కుట్ర పన్నారు? అనేది బయటపడాలి. భారత ప్రభుత్వం రాహుల్‌ను వదిలిపెట్టదు. ఇది నూతన భారతదేశం. ప్రతిచోటా కెమెరాలు అమర్చి ఉన్నాయి. ప్రతీదీ లెక్కలోకి తీసుకుంటున్నారు. మేం ఈరోజు కేవలం ఒక చిన్న లెడ్జర్‌ను మాత్రమే విడుదల చేశాం. లెక్కలేనన్ని పత్రాలు, వాస్తవాలు అందుబాటులో ఉన్నాయి. రాహుల్ గాంధీని వదిలిపెట్టరు" అని సంబిత్ పాత్ర పేర్కొన్నారు.

**ఆర్థిక పతనం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే : కాంగ్రెస్**

మోదీ హయాంలో జరుగుతున్న దేశ ఆర్థిక పతనమనే అసలు సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే రాహుల్ విదేశీ పర్యటనల అంశాన్ని బీజేపీ లేవనెత్తిందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ విమర్శించారు. కేంద్ర మంత్రి పదవి రేసులో ఉండాలనే తాపత్రయంతోనే బీజేపీ నేత సంబిత్ పాత్ర ఈ అంశాన్ని లేవనెత్తారని మండిపడ్డారు. ఇందుకోసం సంబిత్ పాత్ర కాస్త బెటర్ టాపిక్స్‌ను ఎంపిక చేసుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు.

**విశ్వగురువు వాదనలు బట్టబయలయ్యాయి!**

"రాజీపడిన ప్రధానిగా మోదీ వ్యవహరిస్తున్నారు. ఈ విషయం దేశంతో పాటు విదేశాల్లోనూ బట్టబయలైంది. తాను విశ్వగురువు అని ప్రధాని మోదీ చేస్తున్న వాదనలు కూడా పంక్చర్ అయ్యాయి. ఆయన నిత్యం చైనాకు లొంగిపోతున్నారు. వీటన్నింటి నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించడానికే బీజేపీ నేతలు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. కేంద్ర మంత్రి పదవి రేసులో ఉండేందుకే, రాహుల్ గాంధీ గత విదేశీ పర్యటనల అంశాన్ని సంబిత్ పాత్ర భుజాలకు ఎత్తుకున్నారు" అని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

**బీజేపీ నాయకులందరి పర్యటనల వివరాలు వెల్లడిస్తారా?**

"ఉద్యోగాలు, రైతులు, మణిపుర్, చైనాపై మన దేశ ప్రజలు సమాధానాలను కోరుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై రోజూ దుష్ప్రచారం చేయడం మానేసి, బీజేపీ ముందుగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సరిహద్దు వైఫల్యాలు, బలహీనపడుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఒకవేళ ఆకస్మిక విదేశీ పర్యటనలు నేరమైతే, ప్రధాని మోదీ, బీజేపీ నాయకులందరి విదేశీ పర్యటనలు, ప్రతినిధి బృందాల పూర్తి వివరాలను బీజేపీ వెల్లడిస్తుందా" అని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ ట్వీట్ చేశారు.

# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మూడో దశ

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)మూడో దశకు సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన వెలువరించింది. ఆంధ్రప్రదేశ్?, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్నట్లు గురువారం తెలిపింది. ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్ హవేలి, డామన్ దయ్యూలో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ జరగనుంది. అయితే, మంచు ప్రభావిత ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది.




**మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాల పరిశీలన**

ఎస్ఐఆర్ మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (దీూ)లు ఇంటింటికీ వెళ్లి దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. వీరికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు (దీూా)లు సహకరించనున్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా దీూాలను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది.

మరోవైపు, మూడో దశ షెడ్యూల్‌ను రాష్ట్రాల వారీగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్ ప్రాంతాల్లో జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్?ఓలు ఇంటింటిటి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అనంతరం జులై 21న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల చేయనున్నారు.

**తెలంగాణ విషయానికొస్తే!**

ఇక, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25 నుంచి జులై 24 వరకు దీూాలు ఇంటింటికీ వెళ్లనున్నారు. జులై 31న ముసాయిదా జాబితా విడుదల చేసి, అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఝార్ఖండ్, మేఘాలయ రాష్ట్రాల్లో జూన్ 30 నుంచి జులై 29 వరకు పరిశీలన కొనసాగుతుంది. అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. అలాగే, నాగాలాండ్‌లో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు పరిశీలన ఉండగా, నవంబర్ 22న తుది జాబితా విడుదల చేస్తారు. త్రిపురలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు ఇంటింటి పరిశీలన జరగనుంది. డిసెంబర్ 23న తుది జాబితా విడుదల చేయనున్నారు. ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాల్లో జూన్ 28 వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. జులై 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 4 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం తుది జాబితా సెప్టెంబర్ 6న విడుదల కానుంది. అదేవిధంగా, దాద్రా నగర్ హవేలీ, దామన్ అండ్ దయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో జూన్ 4 నుంచి జూలై 3 వరకు బీఎల్?ఓలు ఇంటింటిటిక వెళ్లి పరిశీలించున్నారు. అనంతరం ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 11న ప్రకటించనున్నారు. ఉత్తరాఖండ్‌లో జూన్ 8 నుంచి జులై 7 వరకు దీూాల పరిశీలన జరిగి, సెప్టెంబర్ 15న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

**ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కంప్లీట్!**

కాగా, బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఉత్తర్?ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ాx= ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఇప్పటివరకు జరిగిన తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 59 కోట్లకు పైగా ఓటర్ల వివరాలను సేకరించినట్లు ఈసీ పేర్కొంది. ఆ దశల్లో 6.3 లక్షల బీఎల్ఓలు, 9.2 లక్షల బీఎల్?ఏలు పాల్గొన్నట్లు వెల్లడించింది.

# సంక్షోభాల నివారణలో బ్రిక్స్ నిర్మాణాత్మక పాత్ర

ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం ప్రారంభమైన 2026 బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్వాగతోపన్యాసం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక ఘర్షణలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య అవరోధాలు, సాంకేతికత సవాళ్లు, వాతావరణ మార్పులు ప్రపంచ స్వరూపాన్ని మార్చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సంక్షోభాల నివారణలో బ్రిక్స్ కూటమి నిర్మాణాత్మకంగా, స్థిరత్వాన్ని అందించే పాత్రను పోషిస్తుందనే ఆశాభావాన్ని జైశంకర్ వ్యక్తం చేశారు. ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలపై సమీక్షించుకోవడానికి, ఈ సంక్లిష్ట పరిస్థితుల్లోనూ పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునే ఆచరణాత్మక మార్గాలను వెతుక్కోవడానికి ఈ సదస్సులో జరిగే చర్చలు అవకాశాన్ని కల్పిస్తాయన్నారు.

**కొత్త సవాళ్లతో అనేక దేశాల ఆందోళన**

ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు సవాళ్లతో పాటు అంచనాలనూ సృష్టిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంధన భద్రత, ఆహార భద్రత, ఎరువుల లభ్యత, ఆరోగ్య వ్యవస్థలు, ఆర్థిక సహాయం పొందడం వంటి విభాగాల్లో ఏర్పడిన కొత్త సవాళ్లతో అనేక దేశాలు ఆందోళనకు గురవుతున్నాయని ఆయన చెప్పారు. బ్రిక్స్ కూటమి దేశాల ఆర్థిక వృద్ధి కొనసాగాలంటే సప్లై చైన్లలో స్థిరత్వం, మార్కెట్ల వైవిధ్యీకరణ అనే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ రాజకీయ అస్థిరతలు, వాణిజ్య అంతరాయాలతో ఏర్పడుతున్న పర్యవసానాలను మరింత మెరుగ్గా ఎదుర్కొనేందుకు ఆచరణాత్మక మార్గాలను బ్రిక్స్ దేశాలు కనుగొనాలని భారత విదేశాంగ మంత్రి కోరారు.

**'శాంతి చర్చలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి'**

"ఇప్పుడు సైనిక సంఘర్షణలకు పాల్పడుతున్న దేశాలు, శాంతి చర్చలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో శాంతి, భద్రతల పరిరక్షణ జరగాలి. ఇక ఇదే సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై బ్రిక్స్ దేశాలు అన్నింటికీ అమితమైన ఆసక్తి ఉంది. ఉగ్రవాదంపై బ్రిక్స్ కూటమి ఉమ్మడి పోరు జరపాలి. వాతావరణ మార్పులు యావత్ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాతావరణ మార్పులపై బ్రిక్స్ దేశాల చర్చలు సమానత్వం, విభిన్నమైన బాధ్యతలను కలిగిన ఉమ్మడి సూత్రాలను సమర్థించే దిశగా జరగాలి. ఈ విభాగంలో సుస్థిర అభివృద్ధి భావనను మనమంతా ముందుకు తీసుకెళ్లాలి" అని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు.

**బ్రిక్స్ పురోగతికి సంస్థాగత సంస్కరణలు అత్యవసరం**

"బ్రిక్స్ కూటమిని సంస్థాగతంగా అభివృద్ధి చేసే అంశంపై ఇప్పుడు చర్చలు ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఈ కూటమి పురోగతికి సంస్థాగతమైన సంస్కరణలు అత్యవసరం. అధ్యక్ష హోదాలో దీనిపై భాగస్వామ్య దేశాలతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. కొత్త సభ్య దేశాల అభిప్రాయాలనూ సేకరిస్తోంది. ఈ కూటమిని మరింత సమ్మిళితంగా, సహకార భావనతో కూడినదిగా మార్చడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత బ్రిక్స్ యంత్రాంగాలను సమీక్షించి, అప్‌డేట్ చేస్తోంది.

## శబరిమల కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

శబరిమల ఆలయంతో సహా వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, మతస్వేచ్ఛపై దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు వాయిదావేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును 16రోజులపాటు విచారణ జరిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్‌ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. విచారణకు ముందు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం వయస్సున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సమర్థించాలని కేంద్రం లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినది అయినందున న్యాయసమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. 2019 నవంబర్‌లో అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ వివాదంతోపాటు ఇతర మతాల్లోని మహిళలపై వివక్ష అంశాలను 9మంది సభ్యులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేసింది.

## నీట్ క్వశ్చన్ పేపర్‌కు రూ.5 లక్షలు విద్యార్థులతో నిందితుల డీల్!?

నీట్-యూజీ 2026 పేపర్ లీక్ కేసును విచారిస్తున్న కొద్దీ సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. నీట్ పేపర్‌ను పొందేందుకు విద్యార్థుల నుంచి రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు వసూలు చేశారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) గుర్తించింది. అటు కీలక నిందితుడైన మహారాష్ట్రలోని నాసిక్ 'డాక్టర్' శుభం ఖైర్నార్‌ను సీబీఐ అరెస్ట్ చేయగా, అతడి గురించి కీలక విషయం బయటికొచ్చింది. స్థానికంగా డాక్టర్‌గా చలామణి అవుతోన్న శుభం, ఒక్క రోజు కూడా వైద్యకళాశాలకు వెళ్లకపోవడం గమనార్హం. ఈ దర్యాప్తులో భాగంగా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల యజమానులు, సిబ్బందిని కూడా సీబీఐ ప్రశ్నించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, లీకైన పేపర్‌ను చూసేందుకు తాము రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు చెల్లించినట్లు పలువురు విద్యార్థులు దర్యాప్తు అధికారులకు తెలిపారు. అలాగే యశ్ యాదవ్ అనే నిందితుడి ద్వారా లీకైన ప్రశ్నపత్రం రాజస్థాన్‌కు చేరిందని తేల్చింది. యశ్ యాదవ్‌కు మరో నిందితుడైన వికాస్ బీవాల్‌తో పరిచయం ఉందని, వికాస్ తండ్రి దినేష్ బీవాల్ నీట్-యూజీ ప్రశ్నపత్రం హార్డ్ కాపీని స్కాన్ చేసి, దానిని పీడీఎఫ్ ఫైల్స్‌గా మార్చారని విచారణలో వెల్లడైంది. రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలోని కోచింగ్ సెంటర్లలో చదువుతున్న విద్యార్థులకు స్కాన్ చేసి, పంపిణీ చేయడానికి ముందు నిందితుడు ప్రశ్నపత్రంపై చేతితో రాశాడని వర్గాలు తెలిపాయి. యశ్ యాదవ్ స్వయంగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదని, అతడు బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడికల్ సైన్సెస్ పట్టభద్రుడని వివరించాయి. ఈ పేపర్? లీక్ మొదటగా ఎక్కడ జరిగింది? ప్రశ్నపత్రం నిందితుడికి ఎలా చేరింది? ఆ తర్వాత పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అది ఎలా లభించింది? అనే విషయాలపై ప్రస్తుతం సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇందుకు సంబంధించిన విద్యార్థులు, నిందితుల వాంగ్మూలాలను నమోదు చేస్తుండగా, లీక్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీల మార్గాలపై కూడా దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు.

**డాక్టర్ అంటూ కన్సల్టెన్సీ**

శుభం స్వస్థలం నందగావ్. నాసిక్‌లోని అత్యంత రద్దీగా ఉండే కోచింగ్ కారిడార్‌లో 'ఎస్ఆర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ'ని నిర్వహిస్తున్నాడు. ఈ కన్సల్టెన్సీ నేమ్ బోర్డుపై శుభం పేరు ముందు కూడా డాక్టర్ అని రాసి ఉంది. స్థానికంగానూ అతడు డాక్టర్‌గానే అందరికీ పరిచయం చేసుకున్నాడు. ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్, బీడీఎస్ సహా ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నించే విద్యార్థులకు గైడెన్స్ ఇస్తుంటాడు. అయితే, 2021లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సమీపంలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సుకు శుభం రిజిస్టర్ చేసుకున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. దీని గురించి ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను సంప్రదించగా, కీలక విషయాలు బయటికి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీకి వచ్చాడని, ఆ తర్వాత ఏరోజు క్లాసులకు హాజరుకాలేదని వీసీ చెప్పారు. కనీసం పరీక్షలు కూడా రాయలేదని వివరించారు.

**రూ.10లక్షలకు కొని**

ఈ నీట్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్‌లో బయటపడింది. అయితే, మరింత దర్యాప్తు చేయగా నాసిక్ నుంచే ఈ ప్రశ్నపత్నం లీకైనట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. నీట్ పేపర్‌ను శుభం తనకు తెలిసిన ఓ వ్యక్తి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కొరియర్‌లో వచ్చిన ఆ ప్రశ్నపత్రాన్ని శుభం పీడీఎఫ్ రూపంలోకి మార్చి వాట్సప్‌లో గురుగ్రామ్‌లోని ఓ వ్యక్తికి రూ.15లక్షలకు విక్రయించినట్లు అధికారులు తేల్చారు. అక్కడి నుంచి ఈ పేపర్ రాజస్థాన్, బిహార్, జమ్మూకశ్మీర్, కేరళ తదితర రాష్ట్రాలకు చేరినట్లు వివరించారు.

**గుర్తుపట్టొద్దని గుండు చేయించుకుని**

మరోవైపు నీట్ పేపర్ లీకేజీ దర్యాప్తులో శుభం గురించి తెలుసుకున్న రాజస్థాన్ పోలీసులు మహారాష్ట్ర అధికారులకు సమాచారం అందించారు. దీంతో అతడిని అరెస్ట్ చేసేందుకు నాసిక్ పోలీసులు రెడీ అయ్యారు. అయితే పేపర్ లీక్ బయటపడగానే శుభం తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. తనను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు శుభం గుండు చేయించుకుని తిరిగాడు. ఈ క్రమంలో పక్కాగా డిజిటల్ ఆధారాలను సేకరించిన పోలీసులు మంగళవారం శుభంను అరెస్ట్ చేశారు. అనంతరం సీబీఐ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు శుభంను అప్పగించారు. నిందితుడితో పాటు సోదరుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## కేరళ ముఖ్యమంత్రిగా సతీశన్

కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. 10 రోజులుగా సాగుతున్న మల్లగుల్లాలు, చర్చల అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో చివరకు సతీశన్ వైపే అధిష్ఠానం మొగ్గుచూపింది. ఉద్ధండుల మధ్య జరిగిన పోటీలో, పినరయి విజయన్ సర్కార్‌పై పోరాడిన అనుభవం సతీశన్‌కు కలిసి వచ్చింది. ఢిల్లీలో ఖర్గే, రాహుల్ గాంధీ కసరత్తు, తిరువనంతపురంలో జరిగిన శాసనసభాపక్ష సమావేశం వెరసి కేరళ సీఎంగా సతీశన్ ఎంపిక జరిగింది. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ భేటీ అయి తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నిర్ణయాన్ని కేరళ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ దీపా దాస్‌మున్షీ, పార్టీ కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రకటించారు. "2026 మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు." అని కేరళ ఇంఛార్జ్? దాస్‌మున్షీ అన్నారు. అయితే, ప్రమాణ స్వీకారం ఎప్పుడు జరుగుతుందని ప్రశ్నించగా, తాను కేరళ వెళ్లిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**సతీశన్ ఎంపికపై ఎలాంటి అసంతృప్తి లేదు: కేసీ వేణుగోపాల్**

కేరళ సీఎంగా వీడీ సతీశన్ ఎంపికను స్వాగతిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సతీశన్ ఎంపికపై ఎలాంటి అసంతృప్తి లేదని వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని స్పష్టం చేశారు. సతీశన్ నాయకత్వంలో కేరళ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. "సతీశన్ ఎంపికపై ఎలాంటి అసంతృప్తి లేదు. నేను పూర్తిగా సంతృప్తిగా ఉన్నాను. అధిష్ఠానం నిర్ణయాన్ని శిరసావహిస్తాను. కాంగ్రెస్‌లో హైకమాండ్ నిర్ణయమే శిరోధార్యం. అన్నిరకాలుగా ఆలోచించే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది" అని కేసీ వేణుగోపాల్ అన్నారు. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్‌ను ఎంపిక చేస్తూ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు స్వాగతిస్తున్నారని కేరళ్రాజజ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ అన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137